ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
3
మంగళవారం 5 మార్చి 2024





నేడు జయహో బీసీ సభ

- ఏఎన్‌యూ ఎదుట సభా ప్రాంగణం
- హాజరుకానున్న టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్
- జాతీయస్థాయిలో బీసీల డిక్లరేషన్ విడుదల చేయనున్న నేతలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన టీడీపీ రాష్ట్ర నేతలు

పెదకాకాని, మార్చి 4: తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలు తలపెట్టిన జయహో బీసీ భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేపట్టారు. గుంటూరు విజయవాడ మధ్య ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల సువిశాల ప్రాంగణంలో సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇరు పార్టీలకు చెందిన బీసీలు సుమారు మూడు లక్షల మందికి పైగా తరలివస్తారని టీడీపీ నాయకులు తెలిపారు. విశ్వవిద్యాలయ ఎదురు గల ప్రాంగణంలో సభా వేదికను భారీగా నిర్మించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు ఈ సభలో పాల్గొననున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ మోహన్‌రెడ్డి బీసీలకు చేస్తున్న అన్యాయాన్ని వివరిస్తూ జాతీయస్థాయిలో బీసీలకు ప్రయోజనం చేకూరే విధంగా బీసీ డిక్లరేషన్ ప్రకటించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే విధివిధానాలు తయారు చేసినట్లు ఆ పార్టీ నాయకులు అచ్చెన్నాయుడు, రవీంద్రలు తెలిపారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు పెద్దఎత్తున టీడీపీ, జనసేన బీసీ శ్రేణులు తరలివస్తారని భావిస్తున్న నాయకులు భారీ ఏర్పాట్లను చేపట్టారు. సభా ప్రాంగణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.





ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే అనగాని, సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి రవీంద్ర

ఏర్పాట్లను పర్యవేక్షించిన నాయకులు


బీసీ బహిరంగ సభ ఏర్పాట్లను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీమంత్రి కొల్లు రవీంద్ర, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తదితరులు పర్యవేక్షించారు. సభా ప్రాంగణాన్ని పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సభ ప్రాంగణానికి ఎదురుగా ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేస్తున్నారు.

జగన్ బీసీలకు తీరని ద్రోహం చేశారు.. మాజీ మంత్రి అచ్చెన్నాయుడు

జగన్మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత బీసీలకు తీరని ద్రోహం చేశారని మాజీ మంత్రి, టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. సోమవారం జయహో బీసీ సభ ఏర్పాట్ల పర్యవేక్షణ అనంతరం ఆయన కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలపై జరుగుతున్న దాడులు, దారుణాలు అన్నీ ఇన్నీ కాదన్నారు. బీసీల పట్ల ముఖ్యమంత్రి జగన్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్రంలో ఎందరో బీసీలను పొట్టన పెట్టుకున్న ఘనత జగన్ దే అని అన్నారు. రాష్ట్రవ్యాప్తం గా వందలాది మంది బీసీలను హతమార్చిన దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. తెలుగుదేశం హయాంలో ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను జగన్ పక్కన పడేశార న్నారు. బీసీలను అన్ని విధాల మోసం చేసిన జగన్‌కు బీసీలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

బీసీల ద్రోహి జగన్మోహన్‌రెడ్డి: మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

రాష్ట్రంలో అబద్ధాలు, తప్పుడు మేనిఫెస్టో పెట్టి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ బీసీల ద్రోహిగా మా రారని మాజీమంత్రి కొల్లు రవీంద్ర తెలి పారు. సోమవారం జయహో బీసీ ప్రాం గణం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. జయహో బీసీ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు పాల్గొని ఉమ్మడిగా జాతీయ స్థాయిలో బీసీల డిక్లరేషన్ ప్రకటిస్తారని తెలిపారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో బీసీలు అన్ని రంగాల్లో అణగ దొక్కబడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 75 వేల కోట్ల రూపాయల బీసీల కార్పొరేషన్ రుణాలను ఎత్తివేసిన ఘనుడు జగనన్నారు. బీసీల మధ్య ఐక్యత లేకుండా చేస్తూ కార్పొరేషన్లు గా విభజించారని, కేవలం పదవులు మాత్రమే ఇచ్చారు కానీ ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయలేదని అన్నారు. కేవలం ఉత్సవ విగ్రహాలుగా మాత్రమే బీసీలు మిగిలిపోయారని తెలిపారు. రాష్ట్రంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టేందుకు, తెలుగుదేశం పార్టీలో బీసీలకు జరిగిన ప్రయోజనాలను వివరిస్తూ జాతీయస్థాయిలో బీసీ డిక్లరే షన్‌ను ప్రకటిస్తారని తెలిపారు.



- వైసీపీలో సమన్వయకర్తలకు సీటు విషయంలో దక్కని భరోసా
- ఇన్‌చార్జిలుగా నియామకమే తప్ప ఫైనల్ కాదంటున్న అధిష్టానం
- తాజాగా పార్టీ చేపట్టిన మార్పులతో కొరవడిన ధీమా
- అయోమయంలో వైసీపీ.. కాడి వదిలేస్తున్న ఇన్‌చార్జిలు

నెలల తరబడి సర్వేలు చేయించాం.. ప్రజల్లో అభిప్రాయ సేకరణ జరిపాం.. పరిస్థితులేవీ అనుకూలంగా లేనందున మరొకరికి సమన్వయకర్తగా అవకాశమిస్తున్నాం.. సహకరించాలి.. ఆయా నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిల మార్పు ప్రక్రియ చేపట్టే సందర్భంలో పార్టీ పెద్దలు గతంలో చెప్పిన మాటలివి. అప్పటి నుంచి అసమ్మతి స్వరాలు, అలకలు, రాజీనామాలు పాలకపార్టీలో కొనసాగుతూనే ఉన్నాయి. ఈ అసమ్మతి జ్వాలలు చల్లారకముందే కొత్తగా నియమించిన వారి విషయంలో గ్యారెంటీ లేదనే లీకులను వైసీపీ ఇస్తోంది. వారిని ఆయా నియోజకవర్గాల్లో సమన్వయకర్తలుగా నియమించాం తప్పితే అదే ఫైనల్ కాదనే పొంతనలేని ప్రకటనలను వైసీపీ పెద్దలు చేస్తున్నారు. కొత్త ఇన్‌చార్జిలను నియమించిన చోట మళ్లీ మార్పులు చేపడుతుండడంతో ఇక్కడ నేతలకు ధీమా కరువైంది. ఇది వైసీపీలోని అయోమయ స్థితికి అద్దం పడుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బాపట్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీలో ఇన్‌చార్జిల మార్పు ఓ ప్రహసనంగా మారింది. ఇన్‌చార్జిల మార్పు చేపట్టిన బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏ ఒక్క చోటా కొత్తపాత నాయకులు ఏకతాటి మీద నడవడం లేదు. పైగా ద్వితీయశ్రేణి నాయకులు ఇప్పటికీ నిత్యం తాడేపల్లి గడప ఎక్కుతూ కొత్త ఇన్‌చార్జిలపై తమ అసంతృప్తిని వెలిబుచ్చుతూనే ఉన్నారు. వీరికి తెర వెనక మాజీ నాయకుల సహకారం ఉండడం గమనార్హం. రేపల్లెలో వైసీపీ నియమించిన ఈవూరు గణేష్‌కు నేటికీ పార్టీ శ్రేణుల నుంచి కనీసస్థాయిలో కూడా సహకారం దక్కకపోవడం వైసీపీలోని గందరగోళ స్థితికి ఓ ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

మళ్లీ సర్వేల పరంపర..

ఇన్‌చార్జిల మార్పు నిర్ణయం చేపట్టేటప్పుడు వీళ్లే ఆయా సీట్లకు తుది ఎంపిక అవుతారనే విధంగా వైసీపీ కలరింగ్ ఇచ్చింది. సీన్ కట్ చేస్తే తనకు అలవాటైన రీతిలో తూచ్ అనేస్తూ నాలుక మడతేసింది. మళ్లీ సర్వేలు చేపడుతున్నామని, నియోజకవర్గాల్లో శ్రేణులనుంచి అభిప్రాయాన్ని తాజాగా సేకరిస్తున్నామని ఆ తర్వాతే ఫైనల్‌గా అభ్యర్థి ఖరారు ఉం టుందని తాజాగా వైసీపీ సెల విస్తుండడంతో అవాక్కవడం సదరు నేతల వంతవుతోంది. దీంతో అట్టహాసంగా ఆయా నియోజకవర్గాల్లోకి రంగప్రవేశం చేసిన సమన్వయకర్తలు పార్టీ చేస్తున్న పొంతనలేని ప్రకటనలతో తలలు పట్టుకుంటున్నారు.

తాజా మార్పులతో మరింత బెంబేలు..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మంగళగిరి, పొన్నూరుతో పాటు గుంటూరు పార్లమెంట్ విషయంలో పార్టీ వేసిన పిల్లిమొగ్గలు ఇన్‌చార్జిలను మరింత గందరగోళంలో పడేశాయి. మంగళగిరి విషయంలో ఒకటికి రెండుసార్లు మాట మార్చడం ఒక ఎత్తయితే గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి విషయంలో వైసీపీ చేపట్టిన మార్పులను చూసేసరికి తమ పరిస్థితి కూడా ఇంతేనన్న నైరాశ్యంలో సదరు నేతలు మునిగిపోయారు.

ఏ ప్రకటనా వెలువడని వారిది మరో వ్యథ..

నియోజకవర్గాల్లో కొత్తగా సమన్వయకర్తలుగా వచ్చిన వారి సీటు ఖరారు విషయంలో ఓ తంతు నడుస్తుంటే, పాలకపార్టీలో ఇప్పటికే ఎమ్మెల్యేలుగా కొనసాగుతూ అధికారికంగా ఎటువంటి ప్రకటన రాని వారిది మరో వ్యథ. రోజుకో సర్వే పూటకో అభ్యర్థి పేరుతో వారి గుండెల్లో కూడా వైసీపీ రైళ్లు పరిగెత్తిస్తోంది. మొత్తంగా చూస్తే పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఈ సీటు తనదే అని నమ్మకంగా చెప్పగలిగే సాహసాన్ని వైసీపీ అభ్యర్థులు చేయలేకపోవడం పార్టీలో కొనసాగుతున్న అయోమయ స్థితికి నిదర్శనంగా చెప్పవచ్చు.

అభ్యర్థుల కోసం పక్కచూపులు..

గెలుపు విషయంలో ధీమా సంగతి దేవుడెరుగు కనీసం సమర్థులైన అభ్యర్థులు దొరక్క రోజుకో ప్రకటనతో కాలం వెళ్లదీయాల్సిన దీనస్థితిని వైసీపీ ఎదుర్కొంటుందని టీడీపీ ఆరోపిస్తోంది. ఇన్నాళ్ల బీరాలు పలికిన పాలక పార్టీ ఎన్నికలు దగ్గర పడే కొద్దీ సొంత నేతల వీంద నమ్మకం లేక తమ పార్టీ నేతలకు వలవేసే పనిలో నిమగ్నమైందని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. మునిగిపోయే నావలోకి వెళ్లడానికి ఎవరూ సుముఖంగా లేకపోవడంతో కింకర్తవ్యం ఏమిటో తెలియక అభ్యర్థిత్వాల విషయంలో సర్వేల పేరిట వైసీపీ కాలయాపన చేస్తోందని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

ప్రకటించాక చూసుకుందాంలే..

ఇన్‌చార్జిల మార్పు విషయంలో వైసీపీ వేస్తున్న చిందుల ను చూసి అధికారికంగా తమ పేరు ప్రకటించాక ఆలోచిద్దాంలే అన్న ధోరణికి సదరు నేతలు వచ్చినట్లు తెలుస్తోంది. వైసీపీకి చెంది న ఓ కార్యకర్త తన సమస్యను చెప్పుకుందామని ఇటీవల మార్పు చేపట్టిన బాపట్ల జిల్లాలోని ఓ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త వద్దకు వెళ్లగా తనకే సీటు విష యంలో గ్యారెంటీ లేదని తాను నీకేమీ చేయగలనని చేతులెత్తేయడంతో బిత్తరపోవడం ఆ కార్యకర్త వంతైంది. దాదాపు ప్రతి నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జిలుగా చలామణి అవుతున్న నేతల తీరు ఇలానే ఉంటుంది. సీటు విషయంలో సరైన భరోసా దక్కకపోగా రోజుకో పేరు తెరమీదకు వస్తుండడం వారిని మరింత గందరగోళం లోకి నెట్టడంతో పాటు పార్టీలో పరిస్థితి అయో మయంగా ఉందనే వ్యాఖ్యానాలను సదరు నేతలే చేయడం గమనార్హం. మరో వైపు టీడీపీ మాత్రం విస్పష్ట ప్రకటనతో ఆయా నియోజకవర్గాలకు పోటీ పడే అభ్య ర్థుల పేర్ల ను వెల్లడించడంతో వైసీపీ పని మరింత దిగ జారిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సచివాలయాల్లో.. సేవలు బంద్

- ఇంటర్‌నెట్ బిల్లులు చెల్లించలేదు
- నరసరావుపేట మునిసిపాల్టీలో ఇదీ దుస్థితి

నరసరావుపేట, మార్చి4: నరసరావుపేట మునిసిపాల్టీ పరిధిలోని సచివాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. ధ్రువపత్రాలు, రిజిస్ట్రేషన్‌ల కోసం లబ్ధిదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 33 సచివాలయాల్లో ఇంటర్‌నెట్ సేవలు లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. నెట్ బిల్లులు చెల్లించకపోవడంతో సదరు కంపెనీ సచివాలయాలకు ఇంటర్‌నెట్ సేవలను పూర్తిగా నిలిపివేసింది. గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఏర్పడింది. సచివాలయాల్లో ధ్రువపత్రాలు జారీ, పేదల ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సేవలు పూర్తిగా స్తంభించాయి. చర్యలు తీసుకోవాల్సిన మునిసిపల్ అధికారులు చోద్యం చూస్తుండటంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాలకు వచ్చిన లబ్ధిదారులు గంటల తరబడి పడి గాపులు కాశారం. నెట్ సేవలు నిలిచిపోవడంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో లబ్ధిదారులు వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.




రెండవ వార్డు సచివాలయంలో లబ్ధిదారుల పడిగాపులు

పురపాలక సంఘ పాలన పడకేసింది. దీని వలనే సచివాలయాల్లో సేవలు నిలిచిపోవాల్సి వచ్చింది. మునిసిపల్ నిధులు అధికార పార్టీ నేతల కోసం ఖర్చు చేస్తున్న అధికారులు మాత్రం సచివాలయాలకు సంబంధించిన నెట్ బిల్లులు చెల్లించకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. మునిసిపల్ కమిషనర్ సెలవులో ఉన్నారు. అధికారులు ఇంటర్‌నెట్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. ఇటీవల ఈ దుస్థితి పారిశుధ్య విభాగంలో కూడా నెలకొంది. భూగర్భ డ్రైనేజ్ యంత్రానికి రూ.3 లక్షలు వెచ్చించి మరమ్మతుల చేయించకుండా నెలరోజుల పాటు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లపై డ్రైనేజి నీరు ప్రవహించి తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. పారిశుధ్య వాహనాలకు ఇంధనం లేక పలుమార్లు నిలిచిపోయాయి. చెత్త తొలగింపు కూడా నిలిచిపోయింది. ఇటువంటి పరిస్థితులు తరుచూ మునిసిపాల్టీలో నెలకొంటున్నాయి. అధికారులు ఆర్థిక క్రమశిక్షణ పాటించక పోవడం వలనే పౌరులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పట్టుమని ఏ అధికారి ఆరు నెలలు కూడా పనిచేయని కారణంగానే పాలన పడకేస్తోంది. ఎప్పుడు ఇక్కడ నుంచి బదిలీ చేస్తారో అన్న భావనతో అధికారులు విధులు నిర్వహిస్తు న్నారు. మితిమీరిన అధికార పార్టీ నేతలు జోక్యంతోనే ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. తక్షణమే ఇంటర్ నెట్ ను, సచివాలయాల్లో సేవలు పునరుద్ధరించాలని బాధితులు కోరుతున్నారు.

ఎన్నాళ్లో దాచి.. ఇప్పుడు పంపిణీకి..

పునరావాస పట్టాల పంపిణీలో అవినీతి ● ఎన్నికలు సమీపిస్తున్న వేళ గాలం వేసేందుకు అధికార పార్టీ నేతల హడావిడి

పిడుగురాళ్ల, మార్చి 4: పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు దస్త్రాలన్నీ రెవెన్యూ అధికారులు సిద్ధం చేసి సుమారు ఏడాది కావస్తుంది. కొన్ని సార్లు లబ్ధి దారులు అందు బాటులో లేరని, మరి కొన్నిసార్లు మరో వంకతో పంపిణీని పలుమార్లు వాయిదా వేసి ఇప్పుడు ఎన్నికల వేళ పంపిణీకి సన్నద్ధమవుతున్నారు. అంతేకాకుండా జగనన్న కాలనీలలో కొందరు లబ్ధి దారులకు పట్టాల పంపిణీ చేశాక తిరిగి అవన్నీ రెవెన్యూ అధికారులు తీసుకొని తమవద్దనే పెట్టుకున్నారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ రాక ముందే గ్రామాల వారీగా లబ్ధిదారులకు పంపిణీ చేసే విధంగా అధికార పార్టీ నేతలు రెవెన్యూ అధికారులను సమాయత్తం చేస్తున్నారు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్ళ పట్టాలు

పునరావాస పట్టాల పంపిణీలో ఆగని వసూళ్లు

పులిచింతల పునరావాస కేంద్రాల్లో లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాలను ఇప్పుడు ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సన్నద్ధమైంది. రిజిస్ట్రేషన్లు ఉచితంగా చేయాల్సి ఉన్నప్పటికీ కొందరు ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.2 నుంచి 3 వేల వరకు వసూలు చేస్తున్న వైనంపై పత్రికల్లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. దీంతో పులిచింతల పునరావాస అధికారులు డాక్యుమెంట్ల తయారీని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ఉండే డాక్యుమెంట్ రైటర్లు కాకుండా రెవెన్యూ కార్యాలయాల్లో సంబంధిత అధికారులే తయారు చేసి రిజిస్ట్రేషన్‌ను ఉచితంగా చేయాలని ఆదేశించింది. అయినప్పటికీ రెవెన్యూ కార్యాలయాల్లో సిబ్బంది తక్కువగా ఉన్నారన్న సాకుతో కొందరు ప్రైవేటు వ్యక్తులతో డాక్యుమెంట్ తయారీ ప్రక్రియను రెవెన్యూ కార్యాలయాల్లో రాత్రి సమయంలో పొద్దుపోయే వరకు కూడా చేస్తుండటంపై పలు అనుమానాలకు తావిస్తుందని కొందరు పులిచింతల పున రావాస లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.



పిడుగురాళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పులిచింతల పునరావాసుల రద్దీ

రెండేళ్లయినా.. ఆటంకాలే..

- మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయని ప్రభుత్వం
- వేసవిలో పిడుగురాళ్లకు నీటికష్టాలు

పిడుగురాళ్ల, మార్చి 4: అధికారం వస్తే ప్రజల దప్పిక తీరుస్తామని నేతలు హామీ ఇచ్చి నాలుగేళ్లు అయింది. హడావుడిగా శంకుస్థాపనలు చేసి దాదాపు ఏడాదిన్నర అవుతున్నా నేటికి పునాది రాయికే పరిమితమైన తాగునీటి పథకం పనులు ఎప్పటికి పూర్తయ్యేనో అర్థం కావడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో పనులు నిలిపివేసి కాంట్రాక్టర్ సర్దేసుకున్నట్లు తెలుస్తోంది. పిడుగురాళ్ల పట్టణంలో మూడు వాటర్‌ట్యాంక్‌ల నిర్మాణంతో పాటు ఇంటింటికి మంచినీటి కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీరు అందించేందుకు ఏఐబీ బ్యాంక్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసింది. మొత్తంలో 20శాతం రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా జమచేస్తే మిగిలిన నిధులు బ్యాంక్ విడుదల చేయాల్సి వుంది. 2022 జూన్‌లో పిడుగురాళ్ల మార్కెట్ యార్డు ఆవరణలో, ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో, జూనియర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో మూడు వాటర్‌ట్యాంక్‌ల నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు సిద్ధం చేశారు. జూలై 11, 2022న పిడుగురాళ్ల మార్కెట్ యార్డు, 13న ఆర్ అండ్‌బీ బంగ్లాలో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణాలకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిర్మించాల్సిన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ కూడా చేయలేదు. అయితే వాటర్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సుమారు రూ.15 కోట్ల మేర మార్కెట్ యార్డు, ఆర్‌అండ్‌బీ బంగ్లాలో వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులు చేపట్టారు. ఆ రెండు చోట్ల కూడా బేస్‌మెంట్ లెవల్ వరకే పనులు జరిగాయి. అప్పటి దాకా చేసిన పనుల తాలూకు బిల్లులు చెల్లింపు కోసం కాంట్రాక్టర్ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ రూ.250 కోట్లు బ్యాంక్‌కు జమ చేయకపోవడంతో చేసిన పనులకు నిధులు విడుదల చేయడం కుదరదని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. దీంతో కాంట్రాక్టర్ చేతులెత్తేసి సామాగ్రిని మరోచోటకు తరలించుకుపోయారు.



పిడుగురాళ్ల ఆర్‌అండ్‌బి బంగ్లా ఆవరణలో బేస్‌మెంట్ లెవల్‌లో నిలిచిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు

వేసవిలో గొంతు ఎండాల్సిందే ...

పిడుగురాళ్ల పట్టణానికి ఇప్పటిదాకా గోవిందాపురం కృష్ణానది నుంచి పిడుగురాళ్లకు పైపులైన్ ద్వారా తాగునీరు అందిస్తున్నప్పటికీ అప్పుడప్పుడు మొరాయించి లీకులు కావడం, మరలా మరమ్మతులు చేయడం జరుగుతూనే వుంది. ఇందుకోసం అప్పుడప్పుడు నీటిసరఫరా కూడా నిలిపివేస్తున్నారు. నీటి పథకానికి విద్యుత్ బిల్లే కోట్ల రూపాయల్లో వుంది. విద్యుత్ బిల్లు చెల్లించండి.. లేదా సరఫరా నిలిపి వేస్తామన్నప్పుడల్లా విద్యుత్ ఉన్నతాధికారులకు సర్దిచెప్పి కొద్దోగొప్పో జమచేసి నెట్టుకొస్తున్నారు. పిడుగురాళ్లలో ఇంటింటికి కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీటిని ఇప్పటికి కొన్ని వార్డుల్లో కొన్ని గృహాలకు అందిస్తున్నారు. అందుకు గాను నెలకు రూ.100 చొప్పున ఏడాదికి రూ.1200 ఇంటిపన్నుతో కలిపి వసూలు చేస్తున్నారు. మొదట్లో ఉచితంగా అని చెప్పిన నేతలు ఇప్పుడేమో అధికారులు ఏడాదికి రూ.1200 వసూలు చేయడం ఏమిటని పలువురు దిగువ, మధ్య తరగతి వర్గానికి చెందిన ఇంటి యజమానులు మండి పడుతున్నారు. సవాలక్ష ఆటంకాలతో గోవిందాపురం స్కీమ్ నడుస్తుం డగా పిడుగురాళ్లలో ఏఐబీ ద్వారా మూడు వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం పూర్తి చేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీరు అందిస్తామని చెప్పిన నేతల మాట లు ఆచరణలోకి రావాలంటే ఇప్పటిలో సాధ్యమయ్యేలా లేదు. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయకపోవడంతో చేసిన పనికి బిల్లులు చెల్లింపు జరగక కాంట్రాక్టర్ చేతులెత్తేయడం చూస్తే పనులు మరలా కొనసాగించేలోపు ఎన్నికల హడావుడి మొదలైతే బిల్లులు చెల్లింపులో మరింత జాప్యం జరిగే అవకాశం ఉన్నందున పనులు చేసిన కాంట్రాక్టర్ ఎన్నికల తరువాతే పనులు చేసే ఉద్దేశంలో వున్నట్లు కనిపిస్తుంది.



యార్డు ఆవరణలో బేస్‌మెంట్ లెవల్‌లోనే నిలిచిన వాటర్‌ట్యాంక్ నిర్మాణం

దిక్సూచి
DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

బయాలజీ

స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థ

స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ఒక జత స్త్రీ బీజకోశాలు, ఒక జత స్త్రీ బీజవాహికలు, గర్భాశయం, యోని, అనుబంధ గ్రంథులు ఉంటాయి. ఈ భాగాలు స్త్రీలలో శ్రోణి ప్రాంతంలో ఉంటాయి.


స్త్రీ బీజకోశాలు: ఇవి ఉదర కుహరంలో ఒక జతను కలిగి ఉండి, అండాలను, స్త్రీ బీజకోశ హార్మోనులను ఉత్పత్తి చేస్తాయి. వీటిలో అనేక స్త్రీ బీజ కోశపుటికలు ఉంటాయి. ఈ పుటికలలో అండాలు అభివృద్ధి చెందుతాయి. ఈ పుటికలు ప్రారంభంలో చిన్న చిన్న బుడగల రూపంలో ఉంటాయి. ప్రతి పుటికలోను ఒక అండం ఉంటుంది. అండం పరిపక్వం చెందినపుడు, పుటిక పగిలి అండం విడుదలవుతుంది. ఇలా అండం విడుదల కావడాన్ని అండోత్సర్గం అంటారు. అండాలు స్త్రీ బీజ వాహికలలోకి ప్రవేశిస్తాయి.

స్త్రీ బీజవాహిక: దీనిని ఫాలోపియన్ నాళం అని కూడా పిలుస్తారు. ఇవి ఒక జత ఉంటాయి. స్త్రీ బీజకోశం నుంచి ఇవి బయలుదేరుతాయి. దీనిలో కాలాంచిక, కలశిక, ఇస్తమస్ అనే నిర్మాణాలు ఉంటాయి. కాలాంచిక అనేది గరాటు ఆకారంలో ఉండి స్త్రీ బీజకోశం నుంచి విడులైన అండాలను సేకరిస్తుంది. కాలాంచిక నిర్మాణం తరవాత భాగమైన కలశికలోకి, కలశిక చివరి భాగమైన సన్నటి గ్రీవము(ఇస్తమస్) ద్వారా గర్భాశయంలోకి తెరచుకుంటుంది. ఫాలోపియన్ నాళంలోని కలశికలో శుక్రకణాలు, అండంలో ఫలదీకరణ చెందుతాయి.

గర్భాశయం: రెండు వైపులా ఉండే స్త్రీ బీజవాహికలు ఈ గర్భాశయంలోకి తెరచుకుంటాయి. గర్భాశయం... శ్రోణి ప్రాంతంలో మూత్రాశయానికి, పురీషనాళానికి మధ్య విశాలంగా, ధృడంగా, కండరయుతమై అధిక ప్రసరణ గల తలకిందులైన పియర్ ఆకారం పరిమాణంలో ఉండే కోశం లాంటి నిర్మాణం. పెరిమెట్రియం, మయోమెట్రియం, ఎండోమెట్రియం అనే మూడు కణజాలపు పొరలతో గర్భాశయకుడ్యం నిర్మితమైంది. గర్భాశయ ఎండోమెట్రియం రుతుచక్రంలో చక్రీయ మార్పులకు లోనైతే, ప్రసవ సమయంలో గర్భాశయ మయోమెట్రియం ధృఢమైన సంకోచాలను ప్రదర్శిస్తుంది. దీనిలో పిండ ప్రతిస్థాపనకు అనుకూల వాతావరణపు నియంత్రిత వ్యవస్థ ఉంటుంది. ప్రొజెస్టిరాన్ హార్మోన్ సహాయంతో ఫలదీకరణ చెందిన అండము గర్భాశయ కుడ్యంలో వున్న మృదు కణజాలానికి అతుక్కుంటుంది.

యోని: యోని విశాలంగా ఉండే తంతు-కండర యుత నాళం. దీనిని స్త్రీ బాహ్యజననాంగముగా పేర్కొంటారు. యోనిలో ఊర్ధ్వ, నిమ్న అనే రెండు రంధ్రాలుంటాయి. ఊర్ధ్వ రంధ్రాన్ని బాహ్యప్రసేక రంధ్రం అని, నిమ్న రంధ్రాన్ని యోని రంధ్రం అని పేర్కొంటారు. ప్రసేకం రంధ్రంపైన క్లిటోరిస్ అనే సున్నితమైన సంభించగల నిర్మాణం ఉంటుంది. ఇది పురుష మేహనానికి సమజాతము. యోనిపై భాగంలోని ఉబ్బెత్తు ప్రాంతాన్ని మాన్స్‌ప్యూబిస్ అంటారు. దీని చర్మంపై జఘన రోమాలు, చర్మం కింద కొవ్వు కణజాలపు దిండు ఉంటుంది.

అనుబంధ గ్రంథులు: స్త్రీలలో ప్రత్యుత్పత్తి అనుబంధ గ్రంథులు వరుసగా... బార్తొలిన్ గ్రంథులు, స్కీన్ గ్రంథులు, క్షీర గ్రంథులు. యోని రంధ్రానికి కొద్దిగా కిందగా ఇరువైపులా అమరి ఒక జత బార్తొలిన్ గ్రంథులు ఉంటాయి. వీటి స్రావం యోని మార్గాన్ని సులభంగా జారేటట్లు చేస్తుంది. ఈ గ్రంథులు పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలోని బల్బోయూరెత్రల్ గ్రంథులకు సమజాతం. స్కీన్ గ్రంథులు అనేవి ప్రసేకం కింద ఉంటాయి. ఈ గ్రంథులు పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలోని పౌరుష గ్రంథులకు సమజాతం. ఇవి ప్రేరేపితమైనప్పుడు క్షార జిగట ద్రవాన్ని స్రవిస్తాయి. ఒక జత క్షీర గ్రంథులు శిశు జననాంతరం మాత్రమే పనిచేయడం ప్రారంభిస్తాయి. పురుషులలో ఇవి క్రియారహిత అవశేషాంగాలుగా ఉంటాయి.



బీజ కణోత్పత్తి: బీజకణోత్పత్తి అంటే ప్రాథమిక లైంగిక అవయవాలైన ముష్కం, స్త్రీ బీజకోశాల నుంచి బీజకణాలు(సంయోగ బీజాలు) ఏర్పడటం. పురుషులలో జరిగే బీజకణోత్పత్తిని శుక్రకణోత్పత్తి అని, స్త్రీలలో జరిగే బీజకణోత్పత్తిని అండోత్పత్తి అని అంటారు.

శుక్రకణ నిర్మాణం: శుక్రకణ సూక్ష్మ నిర్మాణంలో... తల, మెడ, మధ్యభాగం, తోక అనే భాగాలు ఉంటాయి. తలభాగంలో ఏక్రోజోమ్ అనే టోపి లాంటి నిర్మాణం ఉంటుంది. ప్రోటియేజ్‌లు, ఏసిడ్ ఫాస్ఫటేజ్, హైలురోనిడేజ్ అనే ఎంజైములు ఏక్రోజోమ్‌లో ఉంటాయి. ఏక్రోజోమ్ అనేది ఫలదీకరణ సమయంలో శుక్రకణం, అండంలోకి చొచ్చుకొని పోయేందుకు సహాయపడుతుంది. తల భాగంలో ఏకస్థితిక కేంద్రం ఉంటుంది. మెడ అనేది తలభాగానికి, మధ్య భాగానికి ఉండే భాగం. మెడ కింది భాగాన్ని మధ్యభాగంగా పేర్కొంటారు. ఈ మధ్య భాగంలో మైటోకాండ్రియాలు చాలా ఉంటాయి. ఇవి శుక్ర కణాల తోక కదలిక, చలనానికి కావలసినంత శక్తిని అందిస్తాయి. మధ్యభాగం కింద ఉన్న నిర్మాణాన్ని తోకగా పేర్కొంటారు. ఈ తోక శుక్ర కణం చలించడానికి తోడ్పడుతుంది.

అండం: స్త్రీ బీజకోశం నుంచి విడుదలైన అండం పూర్తిగా పరిణితి చెందినది కాదు. ఇది జోనా పెల్యూసిడా చేత ఆవరించి ఉంటుంది. అండం విడుదల కావడాన్ని అండోత్సరం అంటారు. అండోత్సరం తరవాత గ్రాపియన్ పుటికలలోని గ్రాన్యులోసా కణాలు విభజన చెంది కార్పస్ లూటియం అనే పసుపు రంగులో ఉండే తాత్కాలిక అంతఃస్రావగ్రంథి కణజాలంగా ఏర్పడుతుంది. కార్పస్ లూటియం ప్రొజెస్టిరాన్ అనే హార్మోనును స్రవిస్తుంది.

రుతుచక్రం: స్త్రీ జీవులలో జరిగే ప్రత్యుత్పత్తి వలయాన్ని రుతుచక్రం అంటారు. రుతుచక్రం అంటే ప్రతి నెల గర్భాశయ అంతర ఉపకళ(ఎండోమెట్రియం)లో జరిగే మార్పుల చక్రం. స్త్రీలలో ప్రతి 28 రోజుల కొకసారి రుతుచక్రం జరుగుతుంది. రుతుచక్రం మధ్యలో ఒక అండం విడుదలవుతుంది. రుతుచక్రాన్ని రుతుస్రావ దశ, పుటిక దశ, అండోత్సర దశ, టాలియల్ దశ అనే నాలుగు దశలుగా విభజించవచ్చు. మొదటి రుతుచక్రం యవ్వన దశలో(10 నుంచి 14 సంవత్సరాలు) ప్రారంభమవుతుంది. దీన్ని రజస్వల లేదా మెనార్కి అంటారు. స్త్రీలలో 45 నుంచి 50 సంవత్సరాల వయసు మధ్యలో రుతుచక్రం ఆగిపోవడాన్ని రుతువిరతి లేదా ముట్లుడగడం(మెనోపాజ్) అంటారు.

సంపర్కం - ఫలదీకరణం: సంపర్క సమయంలో మేహనం యోనిలోకి శుక్రద్రవాన్ని స్కలిస్తుంది. చలన సహిత శుక్రకణాలు వేగంగా, ఈదుతూ గర్భాశయ ద్వారం గుండా గర్భాశయంలోకి ప్రవేశించి చివరకు ఫాలోపియన్ నాళం ఇస్తమస్ ద్వారా కలశికలోకి చేరుతాయి. ఇక్కడ స్త్రీ బీజకోశం నుంచి విడుదలై కాలాంచిక ద్వారా వచ్చిన అండంతో కలుస్తుంది. మానవునిలో అంతర ఫలదీకరణ జరుగుతుంది. ఫలదీకరణ తర్వాత సంయుక్త బీజం అనే నిర్మాణం ఏర్పడుతుంది.

పిండ త్వచాలు: పిండ ప్రతిస్థాపన అనంతరం పిండంలోని కొన్ని కణాలు పిండానికి పోషణ, రక్షణ, ఆధారమునివ్వటానికి వేర్వేరు త్వచాలుగా అభివృద్ధి చెందుతాయి. వీటినే పిండ త్వచాలు అంటారు. అవి.. పరాయువు, ఉల్బము, అళిందము, సోనసంచి.




కె.నాగశేషులు,
సీనియర్ ఫ్యాకల్టీ

రాజమౌళి, మహేశ్ చిత్రం ఎప్పటినుంచి అంటే...!



దర్శక ధీరుడు రాజమౌళితో చేయబోయే యాక్షన్ అడ్వంచర్ చిత్రం కోసం సన్నద్ధమవుతున్నారు మహేశ్ బాబు. ఇందు కోసం తన లుక్‌ను కూడా సరికొత్తగా మార్చుకున్నారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ చిత్రం గురించి ఆయన అప్‌డేట్ ఇచ్చారు. అందరిలానే తానూ రాజమౌళితో చేసే చిత్రం షూటింగ్ ప్రారంభం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయని, త్వరలోనే షూటింగ్ ప్రారంభం అవుతుందని వెల్లడించారు. ప్రొఫెషన్‌ను, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవడం కత్తి మీద సాము లాంటిదని మహేశ్ అన్నారు. తన రీసెంట్ రిలీజ్ 'గుంటూరు కారం' చిత్రంపై ప్రేక్షకులు చూపిన ఆదరణ ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా తన జీవితాన్ని మార్చేసిన మూడు సినిమాల గురించి మహేశ్ ప్రస్తావించారు. 'మురారి', 'పోకిరి', 'శ్రీమంతుడు' చిత్రాలు ప్రేక్షకుల ముందు తనను సరికొత్తగా ఆవిష్కరించాయని తెలిపారు. తాను నటించే చిత్రాలకు అంగీకారం తెలిపేముందు పాత్ర, నైతిక విలువలను దృష్టిలోకి తీసుకుంటానని అన్నారు. ఒకసారి చిత్రానికి సైన్ చేశాక దర్శకుడి విజన్ ప్రకారమే ముందుకెళ్తానని తెలిపారు.



మిడిల్ క్లాస్ రాముడు

విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం టీజర్ విడుదలైంది. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. పరశురామ్ పెట్ల దర్శకుడు. వాసు వర్మ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ సినిమా విడుదల కానుంది.

గోపీసుందర్ కంపోజ్ చేసిన 'దేఖోరే దేఖో' పాటతో హీరో క్యారెక్టరైజేషన్‌ను వర్ణిస్తూ సాగిన ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. సర్‌నేమ్‌కు సరెండర్ అయి, ఫ్యామిలీ అంటే వీక్‌నెస్ ఉన్న మిడిల్ క్లాస్ రాముడిగా హీరో విజయ్‌ను టీజర్ లో చూపించారు. ఈ టీజర్ చివరిలో హీరోయిన్ మృణాల్ 'నేను కాలేజికి వెళ్లాలి.. కొంచెం దించేస్తారా' అని అడిగితే, 'లీటర్ పెట్రోలు కొట్టిస్తే దించేస్తా' అంటాడు హీరో. ఇలా ఫ్యామిలీ, క్లాస్, మాస్, లవ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో కట్ చేసిన టీజర్ కంప్లీట్ మూవీని షార్ట్‌గా చూసిన అనుభూతి కలిగించింది. ఈ సమ్మర్‌కు కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లా 'ఫ్యామిలీ స్టార్' ఉండబోతోందనే క్లారిటీని ఈ టీజర్ ఇచ్చింది.

గామి... సాహస ప్రయాణం

చాందినీ చౌదరి



విశ్వక్‌సేన్ నటించిన 'గామి' చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ చిత్ర కథానాయిక చాందినీ చౌదరి సోమవారం విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

- 'వారణాసి, కుంభమేళ, కశ్మీర్, హిమాలయాలు.. ఇలా విభిన్న లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. ఈ టీమ్‌లో నేను ఒక్కదాన్నే అమ్మాయిని. చాలా సవాల్‌తో కూడిన పరిస్థితుల్ని ఎదుర్కొన్నాం. ముఖ్యంగా వాష్ రూమ్ ఫెసిలిటీస్ లేకపోవడంతో నీళ్లు కూడా తాగేదాన్ని కాదు. దాదాపు నెల రోజుల పాటు అలా షూటింగ్ చేశాం. స్టంట్స్ నేనే రియల్‌గా చేశా. ఒక రకంగా చెప్పాలంటే గామి నిర్మాణం..సాహస ప్రయాణం.
- కథ వినగానే చిత్ర నిర్మాణానికి ఎక్కువ సమయం పడుతుందని అర్థమైంది. ఎందుకంటే చాలా పెద్ద కాన్వాస్ ఉన్న కథ ఇది. దర్శకుడు విద్యాధర్ తను అనుకున్నది వచ్చే వరకూ వదిలిపెట్టరు. షూటింగ్‌కు ఎక్కువ సమయం తీసుకున్నాం కనుకే విజువల్స్ అద్భుతంగా వచ్చాయి.

'భీమ'లో సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్

నిర్మాత కె.కె. రాధామోహన్



'గోపీచంద్ ఇంతకుముందు చాలా పోలీస్ పాత్రలు చేశారు. కానీ 'భీమ'లో పాత్ర విభిన్నంగా ఉంటుంది. కొత్త జానర్‌లో ఉండే కథ ఇది. ఇలాంటిది గోపీచంద్ కూడా చేయలేదు. ఇందులో సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్ చాలా ఉన్నాయి. సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది. పోలీస్ గెటప్ కాకుండా ఇందులో గోపీచంద్ మరో గెటప్ కూడా ఉంది. అదేమిటనేది మార్చి 8న తెలుస్తుంది' అని చెప్పారు నిర్మాత కె.కె. రాధామోహన్. కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా ఆయన నిర్మించిన 'భీమ' చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయన సోమవారం మీడియాతో ముచ్చటిస్తూ 'బాలకృష్ణ గారి 'అఖండ' చిత్రానికి మా సినిమాకీ ఏ మాత్రం పోలిక లేదు. బెంగళూరు, బాదమి పరిసర ప్రాంతాల్లో ఉండే పరశురామ క్షేత్రంలో జరిగే కథ ఇది. శివాలయం, అఘోరాలను యాంబియన్స్ కోసం చూపించాం. అఘోరాలకు ఈ కథతో సంబంధం లేదు' అని ఆయన స్పష్టం చేశారు. దర్శకుడు హర్షను తెలుగు తెరకు పరిచయం చేయడం గురించి వివరిస్తూ 'ముందు మనం కథని నమ్మాలి. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు కథ ఉందా లేదా అని చూడాలి. దానికి తగ్గ నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎన్నుకోవాలి. హర్ష చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. తను కొరియోగ్రాఫర్ కూడా. మా 'బెంగాల్ టైగర్' చిత్రానికి వర్క్ చేశారు. 'భీమ'ని అద్భుతంగా తీశారు. రెండు పాటలకు కొరియోగ్రఫీ కూడా చేశారు' అన్నారు.

ఆంధ్రప్రదేశ్ గురుకులాల్లో ప్రవేశానికి ఏపీఆర్‌జేసీ సెట్



గుంటూరులోని ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ(ఏపీఆర్‌ఈఐఎస్) - ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏపీఆర్‌జేసీ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7 జనరల్ కేటగిరీ, 3 మైనారిటీ కేటగిరీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఈఈటీ, సీజీటీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్ర రీజియన్ గురుకులాలు(జనరల్)

- విజయనగరం జిల్లా-తాటిపూడి గురుకులంలో బాలికలకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- కృష్ణా జిల్లా-నిమ్మకూరు గురుకులంలో బాలురకు ఎంపీసీ 25, బైపీసీ 15, ఎంఈసీ 12, సీఈసీ 15, ఈఈటీ 10, సీజీటీ 11 సీట్లు; బాలికలకు ఎంపీసీ 25, బైపీసీ 15, ఎంఈసీ 13, సీఈసీ 15, ఈఈటీ 11, సీజీటీ 10 సీట్లు ఉన్నాయి.
- పల్నాడు జిల్లా-నాగార్జునసాగర్ గురుకులంలో బాలురకు ఎంపీసీ 68, బైపీసీ 51, ఎంఈసీ 42, సీఈసీ 39 సీట్లు ఉన్నాయి.
- తిరుపతి జిల్లా-వెంకటగిరి గురుకులంలో బాలురకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.

రాయలసీమ రీజియన్ గురుకులాలు(జనరల్)

- కర్నూలు జిల్లా బనవాసి గురుకులంలో బాలికలకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- అన్నమయ్య జిల్లా-గ్యారంపల్లి గురుకులంలో బాలురకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- శ్రీ సత్యసాయి జిల్లా-కొడిగెనహళ్లి గురుకులంలో బాలురకు ఎంపీసీ 50, బైపీసీ 30, ఎంఈసీ 25, సీఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- కృష్ణా జిల్లా-నిమ్మకూరు గురుకులంలో బాలురకు ఈఈటీ 5, సీజీటీ 5 సీట్లు; బాలికలకు ఈఈటీ 4, సీజీటీ 4 సీట్లు ఉన్నాయి.
- పల్నాడు జిల్లా-నాగార్జునసాగర్ గురుకులంలో బాలురకు ఎంపీసీ 12, బైపీసీ 9, ఎంఈసీ 3, సీఈసీ 6 సీట్లు ఉన్నాయి.

మైనారిటీ గురుకులాలు

- గుంటూరు, కర్నూలు జిల్లాల్లో బాలుర గురుకులాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లా-వాయల్పాడులో బాలికల గురుకులం ఉంది. ఒక్కో గురుకులంలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకుగాను ఒక్కోదానిలో మైనారిటీలకు 32, ఎస్సీలకు 6, ఎస్టీలకు 2 సీట్లు; సీఈసీలో మైనారిటీలకు 28, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2 సీట్లు ఉన్నాయి.

అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు రాసే రాష్ట్ర విద్యార్థులందరూ అర్హులే. మొదటిసారే ఉత్తీర్ణులు కావాలి. పదోతరగతి స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గా చదివినవారు మాత్రమే ఉర్దూ మీడియంలో చేరేందుకు అర్హులు.

ఏపీఆర్‌జేసీ సెట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఎంపీసీ/ఈఈటీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, మేథమెటిక్స్, ఫిజికల్ సైన్స్; బైపీసీ/సీజీటీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, బయో సైన్స్, ఫిజికల్ సైన్స్; ఎంఈసీ/సీఈసీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి.

ఏపీఆర్‌జేసీ సెట్ రాసే విద్యార్థులకు:

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31

మైనారిటీ విద్యార్థులకు:

- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **వెబ్‌సైట్:** https://aprs.apcfss.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/SDe5ZXnలో చదవండి.

ప్రతి భారతీయుడు గర్వించే సినిమా

నిహిర్ కపూర్



సీనియర్ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు రూపొందించిన పాన్ ఇండియా మూవీ 'రికార్డ్ బ్రేక్' ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. నటి జయసుధ తనయుడు నిహిర్ కపూర్ ఇందులో ఒక హీరోగా నటించారు. విడుదల సందర్భంగా ఆయన సోమవారం మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.

- ఇంతకుముందు నేను 'గ్యాంగ్‌స్టర్ గంగరాజు' చిత్రంలో నటించాను. ఆ సినిమా షూటింగ్‌లో శ్రీనివాసరావుగారు 'బాగా చేస్తున్నావు.. నా దగ్గర ఓ కథ ఉంది. నువ్వు యాప్ట్ అవుతావు' అని కథ చెప్పారు. చాలా ఎక్సయింటింగ్‌గా అనిపించి నేను ఈ సినిమా ఒప్పుకొన్నాను. ఇద్దరు అనాథలు అడవిలో పెరుగుతుంటారు. కవలలైన వాళ్లిద్దరూ పట్నం వచ్చి కుస్తీ పోటీల్లో పాల్గొని ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం ఈ చిత్రకథ. చాలా ఆసక్తికరంగా చూపించారు.
- 'దంగల్' చిత్రానికీ ఈ కథకు పోలిక లేదు. ఇందులో కుస్తీ పోటీల గురించి చెబుతూ ఇద్దరు అనాథల జర్నీని ఆకట్టుకొనే విధంగా చూపించారు. సెంటిమెంట్, ఎమోషనల్ అంశాలు కలిగిన కమర్షియల్ చిత్రమిది. సాంగ్స్, ఫైట్స్ బాగుంటాయి.
- రాజస్థాన్, హర్యానా వంటి ప్రాంతాల్లో కుస్తీ పోటీలు ఎక్కువగా జరుగుతాయి. డీటైలింగ్ మీద ఉత్తరాది వారు ఎక్కువ సినిమాలు తీస్తుంటారు. 'రికార్డ్ బ్రేక్' తెలుగు సినిమా అయినా ప్రతి భారతీయుడు గర్వించే విధంగా ఉంటుంది. ఇలాంటి చిత్రం తెలుగుతోనే ఆగిపోకూడదు. అందుకే ఎనిమిది భాషల్లో విడుదల చేస్తున్నాం.
- శ్రీనివాసరావుగారికి సినిమా అంటే ప్యాషన్. దేశభక్తి మిళితమైన మంచి కాన్సెప్ట్‌ను ఆసక్తికరంగా జనాలకు చెప్పాలనుకున్నారు. ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు.
- ఇక నుంచి నటనని కంటిన్యూ చేస్తా. అలాగే దర్శకత్వం కూడా చేయాలనుకుంటున్నాను. స్క్రిప్టులు తయారు చేస్తున్నా.

వినూత్నంగా ఆయ్



మ్యాడ్ మూవీతో కుర్రకారును మెప్పించారు నార్నే నితిన్. తాజాగా ఈ నటుడు నయన్ సారికతో కలసి 'ఆయ్' చిత్రంలో నటిస్తున్నారు. అంజి కంచిపల్లి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాసుతో సంయుక్తంగా విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. 'ఆయ్' సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. దీంతో చిత్ర యూనిట్ ప్రమోషనల్ యాక్టివిటీస్‌ను వేగవంతం చేసింది. అందులో భాగంగానే ఈ హిలేరియస్ ఎంటర్టైన్‌మెంట్ టైటిల్‌ను అనౌన్స్ చేశారు. నిర్మాత బన్నీవాస్, నార్నే నితిన్, నయన్ సారిక, డైరెక్టర్ అంజిపల్లి మధ్య జరిగే సరదా ఫోన్ సంభాషణతో టైటిల్‌ను వినూత్నంగా ప్రకటించారు. సరదా సంభాషణ, ఫన్నీ మీమ్స్ రిఫరెన్స్‌లతో సాగే ఈ వీడియో అందరినీ మెప్పిస్తోంది. ఈ వీడియోలో 'సమ్మర్‌లో కలుద్దాం' అంటూ హింట్ ఇచ్చారు. మార్చి 7న ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తామని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్- సమీర్ కల్యాణి, సంగీత దర్శకుడు- రామ్ మిర్యాల, ఎడిటర్- కోదాటి పవన్ కల్యాణ్, ఆర్ట్ డైరెక్టర్- కిరణ్ కుమార్ మన్నె, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్- అజయ్ గద్దె, సహ నిర్మాతలు- భాను ప్రతాప్, రియాజ్ చౌదరి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/afTXIIU లో చదవండి.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణ

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వామి దర్శనం జరగాలి

అమృతలూరు, మార్చి 4: అధికారులు సమన్వయంతో పనిచేయాలని రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ తెలిపారు. ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో ద్వితీయ కో ఆర్డినేషన్ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ మాట్లాడారు. ఆయా శాఖల అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఆయా శాఖలు చేపట్టిన పనులను ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఆలయ పరిసరాల్లో, రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు పర్యవేక్షణ ఉంటుందన్నారు. 200మంది సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. ట్రాఫిక్‌కు ఏలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పండుగ ప్రత్యేక అధికారి అమర్‌నాథ్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం రోజున స్వామివారిని సుమారు రెండు లక్షలమంది భక్తులు దర్శనం చేసుకుంటారన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖ అధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు, అదనపు సిబ్బందిని కేటాయిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కోమల తెలిపారు. వైద్యాధికారి ఏసుబాబు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో, వెలుపల రెండు వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శిబిరాల్లో 24 గంటలు వైద్యులు, 104, 108 వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యుత్ శాఖ ఏఈ నాంచారయ్య మాట్లాడుతూ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయడంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలపాటి రమాదేవి, ఈవో అశోక్‌రెడ్డి, సర్పంచ్ మండవ విజయలక్ష్మీ, డీఎల్‌పీవో తాతా శివశంకరరావు, తహసీల్దార్ కవిత, చుండూరు సీఐ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీ

స్పష్టమైన వైఖరితో ఉంది

● ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్

నరసరావుపేట టౌన్, మార్చి 4 :రాజధాని విషయంలో జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయకక్షలతో వ్యవహరించిన తీరు, రాజధాని లేకపోవటం వలన రాష్ట్రం నష్టపోయిన విధానంపై కాంగ్రెస్ పార్టీ ఒక స్పష్టమైన వైఖరితో ఉందని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అన్నారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పునర్‌వ్యవస్థీకరణ చట్టాన్ని 10 సంవత్సరాలుగా బీజేపీ అమలు చేయకపోవటం, అమలు చేయమని పోరాడలేని వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు ఉండటం వలన ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణించిందన్నారు. ఇప్పుడు దుస్థితిలో ప్రత్యేక హోదా పది సంవత్సరాలు ఇస్తేనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుందనే లక్ష్యాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తుందన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి నెలకు రూ.5వేలు, ఏడాదికి రూ.60 వేలు, ఐదు సంవత్సరాలకు రూ.3 లక్షలు సాయం చేయాలనే గ్యారెంటీని కాంగ్రెస్ ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీతో కలిసి వచ్చే రాజకీయ మిత్రులు ఇండియా కూటమీ రాష్ట్రానికి భవిష్యత్ చూపగలదని అన్నారు. సమావేశంలో ఏపీసీసీ వైస్‌ప్రెసిడెంట్ కొరివి వినయ్ కుమార్, కాంగ్రెస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీ అలెగ్జాండర్ సుధాకర్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతులకు సత్వర న్యాయం చేకూర్చాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాదెండ్ల, టీడీపీ-జనసేన నాయకులు

● కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాదం కారణాలను వెల్లడించాలి
● 700 మంది రైతులకు రూ.100 కోట్ల మేర నష్టం
● కలెక్టర్‌కు నాదెండ్ల మనోహర్ వినతి పత్రం అందజేత
● నివేదికను సీఎం కార్యాలయానికి పంపుతాం : కలెక్టర్

గుంటూరు(తూర్పు), మార్చి4: దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజ్‌లో అగ్ని ప్రమాదం జరిగి దాదాపు 45 రోజులు గడుస్తున్నా, అధికారులు మాత్రం ఇంతవరకు ప్రమాద కారణాలు వెల్లడించలేకపోవడం బాధాకరమని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, తెనాలి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. కోల్డ్‌స్టోరేజ్ అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆప్రాంత రైతులు, జనసేన, టీడీపీ నేతలతో కలిసి సోమవారం స్పందనలో గుంటూరుజిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ దాదాపు 700మంది పసుపు రైతులకు రూ.100 కోట్లు మేర నష్టం వాటిల్లిందని, కానీ అధికారులు మాత్రం రూ.40 కోట్లుకు బీమా ఉందని చెబుతున్నారని, దీంతో రైతులలో ఆందోళన నెలకొందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాకు రూ.13 వేల వరకు ఉందని, కానీ క్వింటాకు రూ.4వేలుచొప్పున లెక్కకట్టడానికి అధికారులు చూస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే రైతులను ఆదుకోవాలని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఉన్నతాధికారులకు లేఖ రాసారని దీనిపై స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ వేగంగా పూర్తి చేసి బీమా సంస్థ నిధులు ఆలస్యమైతే ధరల స్థిరకరణ నిధి, విపత్తు నిధులనుంచి పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే వినతిపత్రంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, మంగళవారం సాయంత్రం లోపు నివేదికను తీసుకుని, వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపుతామని హామీ ఇచ్చినట్టు నాదెండ్ల తెలిపారు. రెండు రోజుల్లో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి స్పందన రాకపోతే భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గాదె వెంకటేశ్వర్లు, నేరెళ్ల సురేష్, గంధం సురేష్, ఆళ్ల హరి, రైతు సంఘ నాయకులు కళ్లం రాజశేఖరరెడ్డి, ఆ ప్రాంత రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీమా అధికారికి రైతు సంఘాల నాయకుల వినతి

గుంటూరు(తూర్పు) : దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు న్యాయం చేయాలని సోమవారం గుంటూరు కొరిటిపాడులోని న్యూఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ డిప్యూటీ మేనేజర్ పీ. నాగచంద్రికకు రైతు సంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు. నాగచంద్రిక స్పందిస్తూ.. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘాల నేతలు కేవీవీ ప్రసాదు, కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జయహో బీసీ సభను విజయవంతం చేయాలి..

గుంటూరు : బీసీ వర్గాల అభ్యున్నతి కోసం మంగళగిరిలో మంగళవారం నిర్వహించే జయహో బీసీ సభను విజయవంతం చేయాలని నాదెండ్ల మనోహర్ పార్టీ వర్గాలకు పిలుపునిచ్చారు. సోమవారం జనసేనపార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈసభలో పాల్గొంటారన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతి కోసం టీడీపీ, జనసేన కలసి పని చేస్తాయని ఆయన తెలిపారు. సమావేశంలో బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గాదె వెంకటేశ్వర్లు, నేరెళ్ల సురేష్, చిల్లపల్లి శ్రీనివాస్, కొర్రపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

620 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

మంగళగిరి, మార్చి 4: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని సోమవారం మంగళగిరి మండలం కాజా టోల్‌ప్లాజా వద్ద విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు టోల్‌ప్లాజా వద్ద నిఘా ఏర్పాటు చేసి రేషన్ బియ్యం తరలిస్తున్న ఏపీ16టీజే5236 నెంబరు గల లారీని అడ్డుకొని 620 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.11.78లక్షలు వుంటుందని మంగళగిరి డిప్యూటీ తహసీల్దారు దుర్గారావు తెలిపారు. బియ్యం బస్తాలను నూజివీడు నుంచి నెల్లూరు జిల్లాకు తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. లారీని, డ్రైవరును అదుపులోకి తీసుకుని మంగళగిరి రూరల్‌పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ ఆళ్ల శ్రీహరి, వీఆర్వో రామారావు, పౌరసరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


జిల్లా జట్టుకు ఎంపికైన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ జట్ల ఎంపిక

మంగళగిరిసిటీ, మార్చి 4: గుంటూరు జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు మంగళగిరి ఫిట్‌జోన్ జిమ్‌లో జరిగాయి. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని సోమవారం వెల్లడించారు. పురుషుల జట్టుకు హెచ్.రమేష్‌శర్మ(గుంటూరు), వై.హర్షవర్ధన్ (తెనాలి), ఎల్.దినేష్(గుంటూరు), ఎస్‌కే అష్రాఫ్ అలీ (గుంటూరు), రామ్‌కుమార్(మంగళగిరి), కౌశిక్(తెనాలి), రాజాదత్తు (గుంటూరు), పీ.దేవేందర్‌రెడ్డి (తెనాలి), ఎం.అభిషేక్ (గుంటూరు) ఎంపికయ్యారు. మహిళల జట్టుకు ఎం.షానున్ (తెనాలి), వి.రేవతి (తెనాలి), ఈఎల్ వినయశ్రీ(తెనాలి), ఎన్.నాగదివ్య (తెనాలి), బి.చంద్రిక (మంగళగిరి) ఎంపికయ్యారు. వీరు విశాఖపట్నంలో జరిగే ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల పదవ తేదీన జరిగే సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ క్లాసిక్ ఎంపిక పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పురుషుల జట్టుకు సందాని కోచ్‌గా, గుమ్మడి వెంకటేశ్వరరావు మేనేజరుగా, మహిళల జట్టుకు విజయభాస్కరరావు కోచ్‌గా, ఘట్టమనేని సాయిరేవతి మేనేజరుగా వ్యవహరిస్తారని తెలియజేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన లిఫ్టర్లను అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆర్ఎస్. వంశీకృష్ణ, బి.ప్రసాద్, పీ.భాస్కరరావు, సంయుక్త కార్యదర్శులు మస్తాన్‌వలి, నాగశిరీష, సభ్యులు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు

టీడీపీ-జనసేన విజయం చారిత్రిక అవసరం

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

చుండూరు మార్చి 4: రాష్ట్రంలో నేడు నెలకొన్న సంక్షోభ పరిస్థితుల్లో టీడీపీజనసేన పార్టీలు అధికారంలోకి రావడం ఓ చారిత్రిక అవసరమని ఆనందబాబు అన్నారు. సోమవారం వేటపాలెంలో జరిగిన టీడీపీ, జనసేన పార్టీల మండల కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆనందబాబు మాట్లాడుతూ చంద్రబాబు సుదీర్ఘ పాలన అనుభవం, రాజకీయ చతురత నేడు రాష్ట్రానికి అవసరమన్నారు. తిరిగి రాష్ట్రంలో మనం అధికార పగ్గాలు చేపట్టి పూర్వ వైభవాన్ని తీసుకురావలన్నారు. జగన్ అసమర్థ పాలనతో సామాన్యుల బతుకులు బారంగా మారాయని, ఉద్యోగుల నెల జీతాల కోసం ఆందోళన చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర సెక్రటరేయట్ తాకట్టు పెట్టుకోవాల్సిన దుస్థితి కల్పించారని, సంక్షేమ పథకాల పేరుతో అన్నివర్గాలను మోసం రాష్ట్రాన్ని దివాళాతీయించాడని మండిపడ్డారు. జగన్ రానున్న ఎన్నికల్లో వలంటరీ వ్యవస్థ ద్వారా లబ్ధి పొందడానికి కుటిలయత్నాలు చేస్తున్నాడని, వీటిని కార్యకర్తలు క్షేత్రస్థాయిలోనే సమర్థవంతంగా ఎదుర్కొవాలని ఆనందబాబు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులు తమ్మా శివారెడ్డి, జనసేన వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఉసా రాజేష్, గూదేటి ఎల్లారెడ్డి, కావూరు శ్రీనివాసరావు, ఎన్ఆర్ఐ బాబు, రాయపాటి శ్రీను, శ్రీరామమూర్తి, కంఠంనేని రాహుల్, దేవిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

గురజాలటౌన్, మార్చి 4: అప్పులబాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మాడుగులలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన బండ్ల నారాయణ (37) తనకున్న 6 ఎకరాలతోపాటు 20 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిరప సాగు చేశాడు. సరైన దిగుబడి రాకపోవడంతో రూ. 28 లక్షల వరకు అప్పులయ్యాయి. మనస్థాపం చెందిన నారాయణ మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.


గుడారాల పండుగకు ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాలు

7 నుంచి గుడారాల పండుగ


గుంటూరు(తూర్పు),మార్చి4: హోసన్నామినిస్ట్రీస్, గోరంట్ల ఆధ్వర్యంలో ఈనెల 7నుంచి 10వ తేది వరకు వరకు 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ జరుపుతున్నట్టు హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వేస్లిలు తెలిపారు. గుడారాల పండుగకు సంబంధించిన ఏర్పాట్లును సోమవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో కంటే ఎక్కువ మంది ఈ పండుగలోపాల్గొనే అవకాశముందని, అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. భోజనశాల, నిద్రించేందుకు వసతులు కల్పిస్తున్నామని బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వేస్లిలు తెలిపారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సిద్ధం

● కాకాని మల్లన్న సన్నిధిలో రేపటి నుంచి అంకురార్పణం
● పెళ్ళికొడుకు పెళ్ళి కుమార్తెగా శివపార్వతులు

పెదకాకాని, మార్చి 4: పెదకాకాని మల్లన్న సన్నిధిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తికావచ్చాయి. ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను రమణీయంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఆలయ ప్రాంగణం, వెలుపల భాగాలు విద్యుత్‌కాంతులతో విరాజిల్లుతున్నాయి. పెదకాకాని జాతీయ రహదారినుంచి ఆలయం వరకు ప్రత్యేక భారీ విద్యుత్ కటౌట్‌లను ఏర్పాటుచేశారు. ప్రధాన కూడళ్లలో సూపర్ వత్తుల విద్యుత్తు కటౌట్లను తీర్చిదిద్దారు. అర్చకులు ఉత్సవ విగ్రహాలను శుభ్రపరుస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో లోపల బయట ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ ప్రసాదరావు, చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకరరావులు పర్యవేక్షిస్తున్నారు.


ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు


ఉత్సవ మూర్తుల విగ్రహాలను శుభ్రపరుస్తున్న అర్చకులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.63 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

1,12,364 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,18,979 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,12,364 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 95,450 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	19500
నెంబరు. 5	13000	19000
273	8000	16500
341	10500	20000
4884	13000	19000
సూపర్ 10	11500	15400
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	20500
బ్యాడిగి	11000	19000
దేవనూరు డీలక్స్	10000	19500
తెల్లకాయలు	5000	11000


మందడం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

మూడుముక్కలాటతో రాష్ట్రం చిన్నాభిన్నం

● 1539 వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్ళూరు , మార్చి 4: మూడు రాజధానుల మూడు ముక్కలాటతో సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశాడని, రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు సోమవారం నాటికి 1539వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ.. అమరావతి ఐదు కోట్ల మంది ఆంధ్రుల సంపదన్నారు. దానిని నిర్వీర్యం చేసే దాక సీఎం జగన్‌రెడ్డి నిద్ర పోలేదన్నారు. ఏ వ్యవస్థని సక్రమం నడపలేకపోయాడన్నారు. గాడి తప్పిన పాలన సరిచేయాలంటే విజన్ ఉన్న నాయకుడు సీఎం కావాలన్నారు. లేకపోతే రాష్ట్ర అధోగతి పాలవుతుందన్నారు. మూడు రాజధానులు అనేది హైకోర్టు తీర్పుతో ముగిసిన అధ్యాయమని, సీఎం జగన్‌రెడ్డి ఇప్పటికైనా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. తుళ్లూరు, నెక్కల్లు, అనంతవరం, వెంకటపాలెం, మందడం, ఉద్దండ్రాయునిపాలెం తదితర రాజధాని గ్రామాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

హుండీల ఆదాయం రూ.20 లక్షలు

అమరావతి, మార్చి 4: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో భక్తుల నుండి కానుకల ద్వారా రూ.20లక్షల ఆదాయం లభించినట్లు ఈవో వేమూరి గోపి తెలిపారు. 80 రోజులకు గాను ప్రధాన హుండీల ద్వారా రూ.18,37,744, అన్నదాన హుండీ ద్వారా రూ1,63,085 ఆదాయం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవోతో పాటు పరిశీలకులు వెంకట శ్రీనివాస్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజరు కౌశల్‌శర్మ, సిబ్బంది, సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

కౌలు రైతు హత్యకేసులో వీడిన మిస్టరీ

● ఒకరు అనుమానంతో.. మరోకరు వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని తుదముట్టించిన వైనం

వినుకొండటౌన్, మార్చి4 : ఈపూరు మండలం అగ్నిగుండాల సమీపంలో కాలవకట్టపై గత నెల 21న కౌలు రైతు తులసీనాయక్‌ను హత్యచేసిన కేసులో ఎట్టకేలకు నలుగురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. వినుకొండ రూరల్‌పోలీసు కార్యాలయంలో సీఐ సుధాకర్ విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి నిందితుల వివరాలను వెల్లడించారు. బొల్లాపల్లి మండలం మాలపాడు గ్రామానికి చెందిన భుక్యా తులసీనాయక్ (42) అగ్నిగుండాల సమీపంలో పొలం కౌలుకు తీసుకుని సాగుచేస్తు జీవనం సాగిస్తున్నాడని, అదేగ్రామానికి చెందిన రామావత్ శివానాయక్ తండ్రి శీతల నాయక్ గతంలో అనారోగ్యంతో మృతి చెందినప్పటికీ, తులసీనాయక్ చేతబడిచేసిన కారణంగానే తన తండ్రి మృతి చెందాడని అనుమానం పెంచుకున్నాడు. అలాగే బొల్లాపల్లి గ్రామానికి చెందిన గంగిరెడ్డి నాగిరెడ్డి తులసీ నాయక్ భార్యతో వివాహేతర సంబంధం కలిగి అతని ఇంటికి వస్తూపోతూ ఉండేవాడు. ఈ విషయంలో తులసీనాయక్ నాగిరెడ్డిని గతంలో పలుమార్లు హెచ్చరించాడు. దీంతో శివానాయక్, నాగిరెడ్డిలు కలసి తులసి నాయక్‌ను అడ్డుతొలగించుకునేందుకు పథకం వేశారు. తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ హర్బన్ దుమ్మాలపేటకుచెందిన యర్రబెల్లి గంగతో రూ.5 లక్షలకు కాంట్రాక్టు కుదుర్చుకున్నారు. శివానాయక్ స్నేహితుడైన రామాంజినాయక్‌తో కలిసి మొత్తం నలుగురు తులసినాయక్‌ను హత్య చేసేందుకు కాపలాకాశారు. ఫిబ్రవరి 21న ఒంటరిగా ద్విచక్రవాహనంపై పొలం వెళ్ళి వస్తున్న తులసీనాయక్‌పై గంగ కర్రతో భలంగా దాడిచెయ్యడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు సీఐ తెలిపారు. కొండ్రముట్ల సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హజరుపరిచినట్లు తెలిపారు. ఎస్ఐలు చెన్నకేశవులు, మహమ్మద్ ఫిరోజ్, నాగిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

7న కాంగ్రెస్ బహిరంగసభ వాయిదా

గుంటూరు, మార్చి 4: ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలతో పాటు ఇతర కాంగ్రెస్ అగ్రనేతలతో ఈనెల 7న గుంటూరులో తలపెట్టిన బహిరంగసభ వాయిదావేసినట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న మహాశివరాత్రి పురస్కరించుకొని బహిరంగ సభను వాయిదా వేశామని, త్వరలోనే సభపై మరో తేదీని ప్రకటిస్తామని లింగంశెట్టి తెలిపారు.

టీడీపీ మైనార్టీ రాష్ట్ర కమిటీలోకి జిల్లా నేతలు

గుంటూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ముగ్గురు నేతలు ఎంపికయ్యారు. గుంటూరు తూర్పు నుంచి షేక్ ఖలీల్, తాడికొండ నుంచి షేక్ మొహమ్మద్ నూర్, ప్రత్తిపాడు నుంచి షేక్ అబ్దుల్ రజాక్, సత్తెనపల్లి నుంచి సయ్యద్ మహబూబ్‌లు ఎంపికయ్యారు. అలాగే టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కమిటీలో గుంటూరు పశ్చిమకు చెందిన పిన్నమనేని రామచంద్రరావు, మాచర్లకు చెందిన వాటికొండ రంగనాయకులు, పీ.పుల్లయ్య, సత్తెనపల్లి నుంచి రావిపాటి మధుబాబు ఎంపికయినట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటించారు.



ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మండల టీడీపీ నాయకులు

టీడీపీకి పూర్వ వైభవం తేవాలి

• ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు

బెల్లంకొండ, మార్చి 4: తెలుగుదేశం పార్టీకి బెల్లంకొండ మండలంలో పూర్వ వైభవం తేవాలని నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. సోమవారం గుంటూరు ఎంపీ కార్యాలయంలో టీడీపీ మండల నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బెల్లంకొండ మండలం గతంలో తెలుగుదేశం పార్టీకి పూర్తి పట్టు ఉన్న మండలం అని, అందరూ కలసికట్టుగా పని చేసి విజయానికి కృషి చేయాలని అన్నారు. అంతేగాకుండా పెదకూరపాడు నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా ఎగురవేసే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అందరూ ఐక్యంగా ఉన్నప్పుడే విజయం సులువుగా ఉంటుందని వివరించారు. ఎంపీని కలిసిన వారిలో సర్పంచ్ జ్యోతి సముద్రం, బీసీ సంఘం మండల అధ్యక్షుడు గుంజా గంగారావు, ఓర్సు రాంబాబు, విజయ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పిడుగురాళ్ల, మార్చి 4: పిడుగురాళ్ల పట్టణ పరిధిలో మంగళవారం విద్యుత్ మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ నాగిరెడ్డి తెలిపారు. మెయిన్‌రోడ్డుకు పడమర వైపున, హైస్కూల్ ప్రాంతం, కుమ్మరి పాలెం, సీతారామపురంతండా ఏరియా, అంజిరెడ్డి హాస్పిటల్ వెనుక వైపు, మిలటరీ కాలనీలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెలగపూడి రామకృష్ణ జయంత్యుత్సవాలు



రామకృష్ణకు నివాళులర్పిస్తున్న కేసీపీ ఉద్యోగులు

మాచర్ల రూరల్, మార్చి 4: పట్టణంలోని కేసీపీ ఫ్యాక్టరీలో సోమవారం వెలగపూడి రామకృష్ణ జయంత్యుత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో జీఎం వెంకటరమణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రామకోటేశ్వరరావు, రామిరెడ్డి, నాగేశ్వరరావు, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, బ్రహ్మం, నారాయణ, శివ, మహేష్, లక్ష్మయ్య, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు గాయాలు

మాచర్ల రూరల్, మార్చి 4: రోడ్డు దాటుతున్న ఓ మహిళను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గాయాలైన ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. ఆదివారం రాత్రి పట్టణానికి చెందిన గుమ్మడి సత్యవతి మండాది రోడ్డులోని రైలు కట్ట వద్ద రోడ్డు దాటుతుండగా, వెల్దుర్తి మండలం మండాదికి చెందిన వలంటీర్ నాగిరెడ్డి వెంకటరామిరెడ్డి ద్విచక్ర వాహనంపై మాచర్ల నుంచి స్వగ్రామం వెళ్తూ ఢీకొన్నాడు. ఈ సంఘటనలో సత్యవతి గాయాలపాలు కాగా మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేట తరలించారు. కాగా వెంకటరామిరెడ్డి కూడా స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమ మద్యం స్వాధీనం

వెల్దుర్తి, మార్చి 4: మండలంలోని కొత్తాపుల్లారెడ్డి గూడెంలో మాచర్ల సెబ్ అధి కారులు సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామంలోని రామాలయం వద్ద 13 అక్రమ మద్యం బాటిళ్లు కలిగి ఉన్న బాణావత్ హేమ్లానాయక్ అనే వ్యక్తిని అదు పులోకి తీసుకున్నారు. అతని నుంచి మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

గోపిరెడ్డికి నివాళులర్పించిన పిన్నెల్లి సోదరులు

మాచర్ల రూరల్, మార్చి 4: మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గన్‌మెన్ గోపిరెడ్డి ఆదివారం బాపట్ల మండలం చుండూరుపల్లి రహదారి వద్ద లారీని ద్విచక్ర వాహనంపై ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో మృతి చెందారు. మృతదేహాన్ని గోపిరెడ్డి స్వగ్రామమైన బాపట్ల మండలం ఉప్పరపాలెంకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పీఆర్కే, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి సోమవారం ఉప్పరపాలెంకు చేరుకున్నారు. గోపిరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5 లక్షల ఆర్థికసాయం అందించారు.

గీతిక సీబీఎస్ఈలో సైన్స్ ఎగ్జిబిషన్



గీతిక సీబీఎస్ఈ స్కూల్లో సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న పాఠశాల చైర్మన్ తాళ్లపల్లి పద్మశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

పిడుగురాళ్ల, మార్చి 4: నిత్య జీవితంలో విజ్ఞానశాస్త్రం, ఆధునిక టెక్నాలజీ ప్రతిఒక్కరికి ఎంతో ముఖ్యమని సీబీఎస్ఈ స్కూల్ చైర్మన్ టి.బాలగంగాధరరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక గీతిక సీబీఎస్ ఈ స్కూల్లో జరిగిన సైన్స్ ఫేర్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేటి మానవాభివృద్ధిపై సైన్స్ ప్రభావం ఎంతగానో ఉందని, అది నిత్యజీవితంలో భాగమైందన్నారు. ప్రపంచంలో పలు దేశాల్లో సైన్స్, టెక్నాలజీ ముందంజలో ఉందని గుర్తుచేశారు. నూతన టెక్నాలజీని నేటితరం యువత, విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తయారు చేసిన రోబోకార్లు, ముందస్తు భూకంప హెచ్చరిక పరికరాలు, భవిష్యత్ హెల్మెట్‌లు, హైడ్రో వ్యవసాయ పద్ధతులు, అంధులకు ఉపయోగపడే కళ్లజోళ్లను విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించడం అభినందనీయమని పాఠశాల చైర్మన్ తాళ్లపల్లి పద్మశ్రీ బాలగంగాధరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మినీ ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం

సత్తెనపల్లి, మార్చి 4: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో గల గర్భిణుల వార్డులో సోమవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మినీ ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. డాక్టర్ యామిని సహకారంతో ఈ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. యామినీని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ సుజాత, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసల వెల్లువ

• కన్నా, జూలకంటి సమక్షంలో సైకిల్ ఎక్కుతున్న వివిధ వర్గాలు



సత్తెనపల్లి నియోజకవర్గంలో కన్నా సమక్షంలో పార్టీలో చేరిన బీసీలు



మాచర్లలో పార్టీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి

సత్తెనపల్లి, మార్చి 4: ఎన్నికల నోటిఫికేషన్ కొద్ది రోజుల్లో విడుదల కానున్న నేపథ్యంలో సత్తెనపల్లి నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు తొందరగా మారిపోతున్నాయి. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ నాయకత్వంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు ఊపందుకున్నాయి. నిత్యం నియోజకవర్గంలో అధికార పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాలు, పట్టణం అనే తేడా లేకుండా అన్ని చోట్ల నుంచి వివిధ వర్గాల వారు వైసీపీని వీడి పెద్ద సంఖ్యలో సైకిల్ ఎక్కుతున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో మంత్రి అంబటి రాంబాబుపై వ్యతిరేకత ఉండటం, అంబటిని వ్యతిరేకిస్తూ వైసీపీలోనే ఒక వర్గం సభలు, సమావేశాలు నిర్వహిస్తుండటంతో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారు. నియోజకవర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో కన్నాను ఆహ్వానించి వివిధ సామాజిక వర్గాలకు చెందిన కుటుంబాలు ప్రత్యేకంగా ఆత్మీయ సమావేశం నిర్వహించి టీడీపీ తీర్థం పుచ్చుకోవటం విశేషం. పార్టీలో చేరుతున్న వారిలో ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు వివిధ వర్గాలకు చెందిన వారు ఎక్కువగా ఉంటున్నారు. ఒక్క ఆదివారమే సత్తెనపల్లి, ముప్పాళ్ళ మండలాల్లో బీసీలు 175 కుటుంబాలు, ముస్లిం మైనార్టీలు 50 కుటుంబాలు పార్టీలో చేరటం విశేషం. దీంతో సత్తెనపల్లి పట్టణంలోని రఘు రామ్‌నగర్‌లో గల కన్నా కార్యాలయం, టీడీపీ ప్రజావేదిక వద్ద సందడి వాతావరణం ఏర్పడింది.

మాచర్ల మండలంలో జూలకంటి ఆధ్వర్యంలో..

విజయపురిసౌత్, మార్చి 4: మాచర్ల మండలం పశువేముల పంచాయతీ పరిధిలోని బ్రహ్మానందపురం తండాకు చెందిన 10వైసీపీ కుటుంబాలు సోమవారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. వెల్దుర్తిలోని టీడీపీ నియోజకవర్గ జూనియర్ జూలకంటి బ్రహ్మారెడ్డి గృహంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి బ్రహ్మారెడ్డి పార్టీ కండువాలను సాదరంగా ఆహ్వానించారు. చంద్రబాబు ప్రవేశపెట్టనున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామన్నారు. పార్టీలో చేరిన వారిలో మూడావత్ లక్ష్మానాయక్, లోకేశ్‌నాయక్, కరెంటోత్ గణేష్‌నాయక్, రమేష్‌నాయక్, హరిజనాయక్, మంత్రునాయక్, స్వామినాయక్ తదితరులున్నారు. కార్యక్రమంలో కాపు జేఏసీ అధ్యక్షుడు పసుపులేటి బ్రహ్మానాయుడు, గుండాల శ్రీనివాసరావు యాదవ్, పశువేముల బాబు, దోపపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటా..

విజయపురిసౌత్, మార్చి 4: అందరూ ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి భరోసానిచ్చారు. స్థానిక డౌన్ మార్కెట్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్తలను ఆదివారం రాత్రి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు పలు సమస్యలను బ్రహ్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ అధికారంలోకి రాగానే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి, జనసేన అధ్యక్షుడు సాంబశివరావు, గుండాల శ్రీను, బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఆడెపు కోటయ్య, మైలపల్లి అప్పలరాజు, నరసింహులు, రామిశెట్టి సైదారావు, రాహుల్, పసుపులేటి బ్రహ్మానాయుడు, గొట్టిముక్కల బాబు, శ్రీరామ్మూర్తి, నూకరాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుకుపాలెంలో కన్నా సంతాపం

ముప్పాళ్ళ మార్చి 4: మండలంలోని ఇరుకుపాలెంలో అనారోగ్యంతో బొమ్మిశెట్టి చౌడయ్య మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని కన్నా లక్ష్మీనారాయణ సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. నివాళి అర్పించిన వారిలో మాజీ ఎంపీటీసీ బొప్పూడి హనుమంతరావు, బొప్పూడి లక్ష్మణరావు, ఈదర కోటేశ్వరరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు తదితరులున్నారు.

జయహో బీసీని జయప్రదం చేయాలి

టీడీపీ, జనసేన నాయకులు

పిడుగురాళ్ల, మార్చి 4: టీడీపీ జనసేన ఆధ్వర్యంలో నేడు గుంటూరు సమీపంలోని నాగార్జునయూనివర్సిటీ వద్ద జరుగనున్న జయహో బీసీ మహాసభను జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తురకా వీరాస్వామి, పట్టణ అధ్యక్షుడు వల్లెపు రామకృష్ణ, మండల కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం టీడీపీ పట్టణ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి బీసీలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని, 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్కరూపాయి కూడా నిధుల్లేకుండా వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. నేడు జరుగనున్న జయహో బీసీ మహాసభకు పల్నాడు ప్రాంతం నుంచి అధికసంఖ్యలో బీసీ సామాజిక వర్గ నేతలు హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో వేముల ఆంజనేయులు, మక్కెన రాజు, యరగాని వెంకట్, బిజిలి వెంకటరావు, జమ్మిశెట్టి రామకృష్ణ, నడికూడి వెంకటేశ్వరరావు, యడవల్లి కొండలు, చింతల అజయ్‌కుమార్, నలబోతుల గాలయ్య, మంచికల్లు శివ, నారబోయిన నరసింహారావు, షేక్ సిలార్ తదితరులు పాల్గొన్నారు.

● జయహో బీసీ బహిరంగసభను జయప్రదం చేయాలని జనసేన జిల్లా జాయింట్ కార్యదర్శి దూదేకుల ఖాశింసైదా తెలిపారు. బడుగు బలహీనవర్గాల సామాజిక రాజకీయ అభివృద్ధి సాధికారత తెలుగుదేశం, జనసేన పార్టీలతోనే సాధ్యమని ఖాశింసైదా పేర్కొన్నారు.

దాచేపల్లి, మార్చి 4: జయహో బీసీ సభను జయప్రదం చేయాలని బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముశ్యం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

గురజాలటౌన్, మార్చి 4: టీడీపీ, జనసేన నేతలు వేలాదిగా తరలి వచ్చి జయహో బీసీ సభను జయప్రదం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ కోరారు.

సత్తెనపల్లి, మార్చి 4: జయహో బీసీ సదస్సుకు నియోజకవర్గంలో బీసీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటస్వామి సోమవారం తెలిపారు.

పెదకూరపాడు, మార్చి 4: రాష్ట్రంలో బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా, సామా జికంగా అభివృద్ధి చేయటమే లక్ష్యంగా టీడీపీ ఆవిర్భావం నుంచి కృషి చేస్తుందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్, రాష్ట్ర శాలివాహన కమిటీ సభ్యులు మోదుగుల చంద్రశేఖర్‌లు అన్నారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సోమవారం జయహో బీసీ బహిరంగ సభ పోస్టర్లను మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు కోరంపల్లి నరేంద్ర, బీసీ సెల్ మండల నాయకులు డాక్టర్ అవ్వారి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

● జయహో బీసీ బహిరంగ సభ ఈనెల 5వ తేదీ నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా గ్రౌండ్‌లో జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ బీసీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన అన్నారు.

అచ్చంపేట, మార్చి 4: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళగిరిలో జరిగే జయహో బీసీ సదస్సుకు బీసీలందరూ తరలిరావాలని విలేకరుల సమావేశంలో మండల నాయకులు అన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు నల్లమేకల వెంకటేశ్వర్లు, బత్తుల శ్రీనివాసరావు, తిరువాయిపాటి అంజనేయులు, ఎనిగండ్ల కోటయ్య, బత్తుల గోపీ, ఎస్‌కే కాసుల, కుంభా ఆంజనేయులు, కోట చంటి తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండ, మార్చి 4: జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం బెల్లంకొండ పార్టీ కార్యాలయంలో బీసీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇబ్రహీం, గుడిసె కొండయ్య, వెన్నా సీతారామి రెడ్డి, వెన్నా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10న గుంటూరులో సావిత్రీబాయి వర్ధంతి సభ


నరసరావుపేట టౌన్, మార్చి 4: గుంటూరులో ఈ నెల 10న నిర్వహించే సావిత్రీబాయి పూలే వర్ధంతి సభను జయప్రదం చేయాలని కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ అన్నారు. సోమవారం నరసరావుపేటలో ఎన్‌జీవో హోమ్‌లో సావిత్రీబాయి పూలే వర్ధంతి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కే కృష్ణ మాట్లాడుతూ గుంటూరు పట్టణంలో బ్రాడీపేటలోని కొరటాల సత్యనారాయణ భవనంలో వర్ధంతి సభ జరుగుతుందన్నారు. సావిత్రిబాయి వర్ధంతి సభను విజయవంత చేయాలన్నారు.

ఇంటింటికి తిరిగిన వైద్యాధికారులు

దాచేపల్లి, మార్చి 4: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా రెండో రోజు దాచేపల్లిలో ఇంటింటికి తిరిగి చిన్నారులు పోలియో చుక్కలు వేయించుకున్న వారి వివరాలు సేకరించారు. సోమవారం పల్నాడు జిల్లా వ్యాధి నిరోదక టీకాల అధికారి గీతాంజలి, పల్స్‌పోలియో నోడల్ అధికారి డాక్టర్ సోనియా మెన్నా దాచేపల్లి, నడికూడి పట్టణాలలో పోలియో చుక్కలు వేయించుకున్న వారి గృహాలను సందర్శించారు.

రెంటచింతల, మార్చి 4: రెంటచింతల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో రెండో రోజైన సోమవారం 79మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ ఎస్ కృష్ణారెడ్డి చెప్పారు. ఇప్పటి వరకు 3648 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయగా ఇక మిగిలింది కేవలం 31 మంది మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, ఏడీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు దుర్మార్గం



మంత్రి కార్యాలయం వద్దకు వెళ్తున్న కౌలు రైతులు

సత్తెనపల్లి, మార్చి 4: కౌలు రైతుల సమస్యలు పరిష్కరించమని కోరేందుకు మంత్రి అంబటి రాంబాబు కార్యాలయం వద్దకు వెళ్తుంటే కౌలు రైతుసంఘ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయటం దుర్మార్గం అని, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు అన్నారు. పంట సాగు హక్కు చట్టం 2019లో మార్పు చేయాలన్నారు. కౌలు భూములు సాగు చేస్తున్న కౌలు రైతులను గుర్తించి ప్రభుత్వం ఇస్తున్న వ్యవసాయ రాయితీలను అందించాలన్నారు. రైలు రైతులకు గుర్తింపు కార్డులు లేకపోవటం పంట రుణాలు, సబ్సిడీ విత్తనాలు అందటం లేదన్నారు. ప్రతి కౌలు రైతును ప్రభుత్వ అధికారులు గుర్తించి గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పెండాల మహేష్, తిమ్మిశెట్టి హనుమంతరావు, లక్ష్మీనారాయణ, పూర్ణచంద్రరావు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి అంబటి రాంబాబుకు వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తున్న కౌలు రైతు సంఘం నాయకులు పట్టణ పోలీసులు అరెస్టు చేసి వెంటనే విడుదల చేశారు.

భద్రతే మన ఆస్తి

• పరాశక్తి సిమెంట్ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు



53 జాతీయ భద్రతా వారోత్సవాల్లో ఎంఎస్ఎన్ రాజు తదితరులు

రెంటచింతల, మార్చి 4: భద్రతే మన ఆస్తి అని పని చేస్తున్నంతసేపు దానికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడే మనం మన కుటుంబాలు రక్షణలో ఉంటాయని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు అన్నారు. సోమవారం ఫ్యాక్టరీ ఆవరణలో 53వ జాతీయ భద్రతా వారోత్సవాలకు సంబంధించి ర్యాలీ నిర్వహించారు. తొలుత భద్రతా జెండా ఆవిష్కరణ, కార్మికుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్మికులు జాగరూకతతో వ్యవహరించడం వల్లనే ప్రమాదాలు లేని కార్మాగారం పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ అనే నానుడి ఎల్లెడెలా వ్యాపించిందన్నారు. ఆదివారం వరకు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎ.రామకృష్ణారెడ్డి, సీనియర్ డిప్యూటీ మేనేజర్ ఎ.వెంకట్రావ్, డిప్యూటీ మేనేజర్ జి.మల్లికార్జునరావు, ఎకౌంట్స్ మేనేజర్ శ్రీనివాసబాబు, సేఫ్టీ మేనేజర్ నాగరాజు, కీసర వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు టీడీపీలోనే ఎంతో మేలు

• ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కనుమూరి డాని యేలు

నకరికల్లు, మార్చి 4: ఎస్సీలకు టీడీపీలోనే ఎంతో మేలు జరుగుతుందని నకరికల్లు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కనుమూరి డానియేలు అన్నారు. సోమవారం చల్లగుండ్ల, చీమలమర్రి, దేచవరం, రూపెనగుంట్ల, కండ్లకుంట గ్రామాల్లో ఎస్సీలను కలసి ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 27 ఎస్సీ పథకాలను రద్దు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బొజ్జా కాంతారావు, బండారు నాగరాజు, కే కోటేశ్వరరావు, బండారు ఏలియా, జంగాల శ్రీనివాసరావు, దారా ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న టాటా మ్యాక్సీ

• ఇద్దరు మృతి

వెల్దుర్తి, మార్చి 4: ద్విచక్ర వాహనాన్ని టాటా మ్యాక్సీ ఢీకొనగా ఇద్దరు మృతిచెందిన సంఘటన మండలంలోని మండాదిలో జరిగింది. మండాదికి చెందిన శీలం కోటిరెడ్డి (36), శివారెడ్డి (50)లు ఆదివారం రాత్రి మిర్చి కల్లానికి కాపలా ఉండేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారి దాటుతుండగా మాచర్ల నుంచి శిరిగిరిపాడు వైపు వెళ్తున్న టాటా మ్యాక్సీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కోటిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో ఉన్న శివారెడ్డిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. కోటిరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలున్నారు. శివారెడ్డికి కుమార్తె ఉంది. దీనిపై వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా శారదాదేవి



మన్నవ శారదాదేవి

సత్తెనపల్లి, మార్చి 4: తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సత్తెనపల్లి పట్టణానికి చెందిన మన్నవ శారదాదేవిని రాష్ట్ర జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నియమించినట్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కే అచ్చెన్నాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల కాపీని శారదాదేవి విలేకరులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన నారా చంద్రబాబునాయుడు, అచ్చెన్నాయుడుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గంలో టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పదవి ఇప్పించిన కన్నా లక్ష్మీ నారాయణకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కన్నాను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు.

పల్నాడు పవర్ లిఫ్టర్ల ప్రతిభ



పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపిన పల్నాడు పవర్ లిఫ్టర్లు

సత్తెనపల్లి, మార్చి 4: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో ఈ నెల 3వ తేదీన నిర్వహించిన ఇంటర్ కళాశాల పవర్ లిఫ్టింగ్ టోర్నమెంట్ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ ఎంపికలో పల్నాడు జిల్లాకు చెందిన పవర్ లిఫ్టర్లు ప్రతిభ చూపారని పవర్ లిఫ్టర్ల అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జిమ్ము రాజు, పసుపులేటి సురేష్‌లు సోమవారం విలేకరులకు తెలిపారు. పురుషుల జట్టులో 66 కేజీల విభాగంలో అశోక్‌కుమార్ బంగారు పతకం, బీ శివ రజిత పతకం సాధించారని వారు తెలిపారు. మహిళా విభాగం 47 కేజీల్లో ఎం అనూష బంగారు పతకం సాధించారని, 76 కేజీల విభాగంలో పీ జ్యోతి బంగారు పతకం సాధించినట్టు వారు తెలిపారు. పల్నాడు టీమ్ ఓవరాల్ టైటిల్స్ స్ట్రాంగ్ మెన్ ఎం అశోక్‌కుమార్, స్ట్రాంగ్ ఉమెన్ టీ జ్యోతిలు గెలుచుకున్నారని వారు తెలిపారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో కూడా మంచి ప్రతిభ చూపి పల్నాడు జిల్లాకు మంచి పేరు తేవాలని వారు కోరారు.

విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కమిటీలో బాషా



షేక్ బాషా

పిడుగురాళ్ల, మార్చి 4: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కమిటీ కార్యదర్శిగా గురజాల నియోజకవర్గానికి చెందిన షేక్ బాషా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు విడుదల చేసిన రాష్ట్ర కమిటీ జాబితాలో గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన షేక్ బాషాకు చోటు దక్కింది. టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియలో పిడుగురాళ్ల మండలంలో 4,600కు పైగా సభ్యత్వాలు నమోదు చేయించి రాష్ట్ర స్థాయిలో 8వ స్థానం, విభిన్న ప్రతిభావంతుల కోటాలో మొదటి స్థానంలో బాషా నిలిచాడు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కూడా సభ్యత్వ నమోదులో ముందు నిలిచిన బాషాను అభినందించారు. రాష్ట్ర కమిటీలో తనకు స్థానం కల్పించినందుకు యరపతినేని శ్రీనివాసరావుకు సహకరించిన పార్టీ నేతలకు బాషా కృతజ్ఞతలు తెలియజేశారు.

టీడీపీ వాణిజ్య విభాగం కార్యదర్శిగా పుల్లయ్య



పంగులూరి పుల్లయ్య

కారంపూడి, మార్చి 4: టీడీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ కార్యదర్శిగా మండలంలోని ఒప్పిచర్లకు చెందిన పంగులూరి పుల్లయ్య నియమితులయ్యారు. తన నియామకానికి కృషి చేసిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పుల్లయ్య నియామకంపై టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షుడు బొల్నేడ శ్రీను, చప్పిడి రాము, బాలకృష్ణ, మస్తాన్ జాని, తుపాకుల రత్తయ్య, నాగారపు రామకృష్ణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మహాశివరాత్రి కోసమైనా మరమ్మతులు చేయండి

రెంటచింతల, మార్చి 4: పల్నాట ప్రముఖ శైవక్షేత్రం కృష్ణానది ఒడ్డున గల సత్రశాలకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. దీంతో వాహన చోదకులు వెళ్ల డం ఇబ్బందిగా మారింది. దీనికి తోడు రోడ్డు పక్కన ముళ్ల కంపచెట్లు పెరగడం వల్ల ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 8న మహాశివరాత్రి సందర్భంగా వేలాది మంది భక్తులు శివుడి దర్శనం కోసం తరలి వస్తుంటారు. పాలువాయి జంక్షన్ నుంచి సత్రశాల వెళ్లే రహదారి, అలాగే రెంటచింతల నుంచి మిట్టగుడిపాడు మీదుగా సత్రశాల వెళ్లే రహదారికి తక్షణమే ప్యాచ్ వర్కులు చేయాలని కోరుతున్నారు.

7 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

నకరికల్లు, మార్చి 4: చేజర్ల కపోతేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 7వ తేదీ గురువారం నుంచి 13వ తేదీ బుధవారం వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో వై వెంకయ్య సోమవారం తెలిపారు. 10వ తేదీ ఆదివారం చేజర్ల తిరునాళ్ళ నిర్వహించనున్నట్టు చెప్పారు. 10వ తేదీ అర్ధ రాత్రి దాటిన తరువాత తెల్లవారు జామున 3గంటలకు గంగా భ్రమరాంబ పార్వతీ సమేత కపోతేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు. వారం రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు వెంకయ్య వివరించారు.

ఆటో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా బ్రహ్మేశ్వరరావు



బ్రహ్మేశ్వరరావును సన్మానిస్తున్న యూనియన్ సభ్యులు

కారంపూడి, మార్చి 4: కారంపూడి ఆటో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా బ్రహ్మేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని అంజనా కల్యాణ మండపంలో ఆదివారం ఈ ఎన్నిక జరిగింది. అనంతరం యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బండారు వీరేశ్వరరావు, కోశాధికారిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా పిన్నెల్లి నాగరాజు, జాయింట్ సెక్రటరీగా ఊటుకూరి రాము, జా యింట్ ట్రెజరర్ మాడిశెట్టి నరసింహారావు, గౌరవ సలహాదారులుగా ఇమ్మడిశెట్టి సాంబశివరావు, పయ్యావుల శ్రీనివాసరావు, చల్లా ప్రసాద్, ముచ్చర్ల రామకోటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా మిత్తింటి సాంబశివరావు, కల్లుట్ల రమేష్‌బాబు, గర్రె రామారావు, గుండాల వెంకటేశ్వరరావు, మిర్యాల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అనంతరం బ్రహ్మేశ్వరరావును దుశ్శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గణితి శివ నాగేశ్వరరావు, బొగ్గవరపు శ్రీనివాసరావు, కొత్తమాసు మోహనరావు, వెచ్చా వెంకటేశ్వర్లు, తండా సైదా, యేచూరి సాంబశివరావు, మిర్యాల పాపారావు, గుబిలి శ్రీనివాసరావు, వేముల లింగయ్య, శివబాబు, ఆతుకూరి గోపి, నలబోలు లక్ష్మీనారాయణ, గుండా చిన రామారావు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

స్పందనకు 108 ఫిర్యాదులు

నరసరావుపేట టౌన్, మార్చి 4: పల్నాడు జిల్లా నరసరావుపేట జిల్లా కలెక్టరేట్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందన హాల్‌లో జగనన్నకు చెబుదాం స్పందన ఫిర్యాదులను సోమవారం కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కలపశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కే వినాయకం స్వీకరించారు. కలెక్టరేట్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందన హాల్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారులంతా హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా అర్జీదారులు తమ విన్నపాన్ని వినతుల రూపంలో సమర్పించారు. అర్జీలను ఆయా శాఖలకు అందిస్తూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని సూచించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు 108ఫిర్యాదులు అందించారని జిల్లా కలెక్టరేట్ సిబ్బంది చెప్పారు. అర్జీదారులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో అన్నదానాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్, డీఆర్‌వో వినాయకం

ఎన్నికల అధికారులకు శిక్షణ

నరసరావుపేట, మార్చి 4: ఎన్నికల విధులపై అధికారులకు కలెక్టరేట్‌లో సోమవారం శిక్షణ ఇచ్చారు. సీ విజిల్, ఈఎస్ఎంఎస్‌లపై అవగాహన కల్పించారు. అధికారులకు ఎన్నికలకు సంబంధించిన విధుల్లో చేరాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన నిబంధనలను తెలిపారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, ఐటీ శాఖ సంబంధించి చిన్నారావు, అటవీ శాఖ అధికారి రామచంద్రరావు, రవాణా శాఖ అధికారి పరంధామరెడ్డి, ఐటీ శాఖ, జీఎస్టీ, సెంట్రల్ జీఎస్టీ, పోలీస్ శాఖ, సెంట్రల్ కమర్షియల్ టాక్స్, సెంట్రల్ పోస్ట్ ఆఫీస్, ఎక్సైజ్ శాఖ, సెబ్, కోపరేటివ్ జిల్లా అధికారి, రైల్వే శాఖ సంబంధించిన శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లో ధనలక్ష్మీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఈపూరు, మార్చి 4: మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్, పవర్‌లిఫ్టింగ్ క్రీడలలో ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా అంతర కళాశాలల పోటీలకు నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చుండు వెంకట్రావు తెలిపారు. ఈ నెల 1, 2 తేదీలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర కళాశాలల సాఫ్ట్‌బాల్ పోటీలలో ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల జట్టు తృతీయ స్థానం సాధించింది. అదేవిధంగా మహిళల పవర్ లిఫ్టింగ్ పోటీలలో 47 కేజీల కేటగిరిలో ఎం.అనూష, పురుషుల విభాగంలో 74కేజీల కేటగిరిలో బాలసుబ్రమణ్యం ద్వితీయ స్థానం, 66 కేజీల కేటగిరిలో ఐ.శివాంజినేయులు ద్వితీయ స్థానం సాధించి విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సాఫ్ట్‌బాల్ క్రీడలో ప్రతిభ కనబరిచిన ఎస్‌కే హయామ్, యామర్తి శ్రీనివాసరావులు యూనివర్శిటీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు అభినందించారు.

77 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

వినుకొండ టౌన్, మార్చి 4: మండలంలోని విఠంరాజుపల్లి సమీపంలో 77 బస్తాల పీడీఎఫ్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే... విఠంరాజుపల్లి గ్రామం నుంచి మినీ ట్రక్ ఆటోలో బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు విజిలెన్స్ అధికారుల ఆదేశాల మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ ఈశ్వరరావు 77 బస్తాలు పీడీఎఫ్ బియ్యం కలిగిన ఆటోను అదుపులోకి తీసుకున్నారు. ఆటో డ్రైవర్ కోటకొండ నాగరాజుపై 6ఏ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. బియ్యాన్ని అదుపులోకి తీసుకున్న సంఘటనపై తొలుత వివరాలు వెల్లడించకుండా అధికారులు వ్యవహరించిన తీరు పలు అనుమానాలకు తావిస్తోంది.



అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు



సమావేశానికి హాజరైన అధికారులు

పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలపై సమావేశం

వినుకొండ, మార్చి 4: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆర్వో సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖ అధికారులతో కలిసి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో సుబ్బారావు మాట్లాడుతూ 27 సెక్టార్ల పరిధిలోని పోలింగ్ బూత్‌లను అధికారులు మరోసారి పరిశీలించి ఓటర్లకు అవసరమైన ఏర్పాట్లను చేయాలన్నారు. ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సెక్టార్ అధికారులతో పాటు ఫ్లయింగ్‌స్క్వాడ్, రూట్ అధికారులు, రెవెన్యూ, పోలీస్ అధికారుల సూచనలు, సలహాలు తీసుకున్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

బొల్లాపల్లి, మార్చి 4: మండలంలోని పేరూరుపాడులో బాలవికాస్ వారి సహకారంతో గంటకు వెయ్యి లీటర్ల సామర్థ్యం గల మినరల్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ వాటర్ ప్లాంట్‌ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, సర్పంచ్ మూలా స్వాతి, కన్వీనర్ మట్టి రాజయ్య, బొమ్మిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మట్టి అంజయ్య, మానుకొండ శ్రీనివాసరెడ్డి, పీ అవినాష్‌రెడ్డి, యన్నం సూరిబాబు, గంధం భాస్కర్‌రెడ్డి, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



పేరూరుపాడులో వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

10న గుంటూరులో సావిత్రీబాయి వర్ధంతి సభ

నరసరావుపేట టౌన్, మార్చి 4: గుంటూరులో ఈ నెల 10న నిర్వహించే సావిత్రీబాయి పూలే వర్ధంతి సభను జయప్రదం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ అన్నారు. సోమవారం నరసరావుపేటలో ఎన్జీవో హోమ్‌లో సావిత్రీబాయి పూలే వర్ధంతి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కే కృష్ణ మాట్లాడుతూ గుంటూరు పట్టణంలో బ్రాడీపేటలోని కొరటాల సత్యనారాయణ భవనంలో వర్ధంతి సభ జరుగుతుందన్నారు. సావిత్రిబాయి వర్ధంతి సభను విజయవంతం చేయాలన్నారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య కంబాల ఏడుకొండలు, పీడీఎం వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, బాత్ బచావో వీ కోటనాయక్, కే స్వరూప్, రెడ్డిబోయిన ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ ధర్నా

నరసరావుపేట టౌన్, మార్చి 4: బొల్లాపల్లి మండలంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. బొల్లాపల్లి మండలంలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడి ప్రజలు తాగునీరు లేక అల్లాడిపోతున్నారని, భూగర్భ జలాలు అడుగంటిపోయి, బోర్లలో, బావులలో నీళ్ళు లేక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని పజా సంఘాల నాయకులు అన్నారు. వారానికి ఒకరోజు మాత్రమే స్నానం చేస్తున్నారని, వాడుకోవడానికి నీళ్ళు లేవని, ప్రభుత్వ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీళ్ళు కొంత సరఫరా చేస్తున్నా అధికార పార్టీ వాళ్ళకు మాత్రమే కొద్దో గొప్ప అందుతున్నాయని అన్నారు. మిగిలిన ప్రజలు నీళ్ల లేక దూర ప్రాంతాలకి వెళుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ట్యాంకర్ల ద్వారా అందరికి తాగునీళ్ళు అందించాలని డిమాండ్ చేశారు. రెంటచింతల మండలం మల్లవరంలో ట్యాంకర్ దగ్గర నీళ్ళు తెచ్చుకోవడానికి వెళ్లిన మహిళను నీవు మా పార్టీ కాదని ట్యాంకర్‌తో తొక్కి చంపారని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు బొల్లాపల్లి మండలంలో జరగకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ కోట నాయక్, పీడీఎం నాయకుడు వై.వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, ఎంఆర్‌పీఎస్ రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ, పీకేసీ జిల్లా కమిటీ సభ్యుడు కంబాల ఏడుకొండలు, సురభి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మునమాకలో...

నరసరావుపేట టౌన్, మార్చి 4: రొంపిచర్ల మండలం మునమాకలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్థులు సోమవారం తెలిపారు. గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు, పైప్‌లైన్ నిరుపయోగంగా మారాయని చెప్పారు. మండలంలోని వడ్లమూరివారిపాలెం నుంచి విపర్ల, మునమాకకు పైప్‌లైన్ ద్వారా తాగునీరు సరఫరా అయ్యేదని, నాలుగు సంవత్సరాల క్రితం వచ్చిన వరదలలో విపర్ల వద్ద కల్వర్టు కొట్టుకుపోవడంతో మునమాకకు తాగునీటి సరఫరా ఆగిపోయిందన్నారు. అప్పటినుంచి పట్టించుకున్న నాధుడులేడని పలువురు వాపోయారు. ఈ విషయమై 2023 సెప్టెంబరు 15న రొంపిచర్లలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళామని, ఆయన వెంటనే స్పందించి బోరువేసి వెంటనే తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు బోరు వేయగా 300అడుగులు వేసినా నీరుపడలేదన్నారు. అందుకు వారు పాతలైన్ మరమ్మతులు చేయించి రెండు నెలల్లో తాగునీరు అందిస్తామని చెప్పారని, నేటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదన్నారు. వేసవికాలం కావడంతో తాగునీటి సమస్య తీవ్రమైందని, తక్షణమే తాగునీటి పథకం పునరుద్ధరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ బొల్లా

● రా..కదిలిరా సభను చూసి ఎమ్మెల్యే చిన్నమెదడు దెబ్బతింది
● అవినీతి సొమ్మును కక్కించి జైలుకు పంపిస్తాం: జీవీ
● నోరు అదుపులో పెట్టుకోవాలి: మాజీ ఎమ్మెల్యే మక్కెన



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 4: రా కదిలిరా కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి ఓర్చుకోలేని బొల్లాకు చిన్నమెదడు పనిచేయక, కళ్లకు కొవ్వెక్కి చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేస్తున్నాడని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబును విమర్శించేస్థాయి బొల్లా లేదని, ఒక గల్లీకి కూడా సరిపోని నువ్వు మా నాయకుడిని విమర్శిస్తావా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడుపై అక్రమంగా కేసులు పెట్టి 52 రోజులు జైల్లో పెట్టారన్నారు. గతంలో 1999లో తనతో పాటు వినుకొండ సీటు కోసం ప్రయత్నించి చంద్రబాబును నీవు పొగడలేదా, ఆ రోజు మంచివాడు నేడు చెడ్డవాడు ఎందుకయ్యాడని నిలదీశారు. వినుకొండ మండల కార్యాలయంలో గతంలో రోజా మీటింగ్‌లో నీవు ఏం మాట్లాడావు, కోస్తే నీలో నుంచి పసుపురక్తం వస్తుందన్న మాట గుర్తులేదా అన్నారు. కాస్త విమర్శలు తగ్గించి ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని, మోసం, వెన్నుపోటు బొల్లా బ్రాండ్ అని అన్నారు. వైశ్యులు, ముస్లింలు, కాపుల భూములను అప్పనంగా దోచుకున్నావని, నాలుగు నెలలు ఆగితే కేసులు పెట్టి బొక్కలో వేయిస్తామన్నారు. బీసీలకు, దళితులకు పంచిన భూములను రూ.4లక్షలకు కొనుగోలు చేసి రూ.18లక్షలకు పేదలకు అమ్మి పేదల ఇళ్ల ప్లాట్ల పేరుతో ప్రజలను మోసం చేయలేదా అని ప్రశ్నించారు. వీసీ నరసింహారెడ్డి వద్ద భూములు దోచుకున్నది ఎవరని, బొల్లా అవినీతికి అనకొండ అని, ఘాట్‌రోడ్డు పేరుతో కోట్ల రూపాయలు దోచుకోలేదా అని నిలదీశారు. జగన్‌మోహన్‌రెడ్డి వేధింపులు తట్టుకోలేకనే నాడు కోడెల శివప్రసాద్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారన్నారు. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ అనుమతులు తెచ్చిన ఘనత ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకే దక్కిందని, పార్టీ మారారనే ఉద్దేశంతో ఆయనపై విమర్శలు చేయడం తగదన్నారు. నేటికి వరికపూడిశెల ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పర్యావరణ అనుమతులు ఎందుకు ఇవ్వలేదో మీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని అడగాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 17 మెడికల్ కాలేజీల్లో రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించిన మూడు కాలేజీల్లో ఒకటి గురజాల నియోజకవర్గంలో ఏర్పాటు చేశారని, దీనికి రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మల్లికార్జునరావు మాట్లాడుతూ బొల్లా మాట్లాడేటప్పుడు సభ్యత, సంస్కారంతో మాట్లాడితే మంచిదన్నారు. కేంద్రం నుంచి రోడ్ల నిర్మాణం కోసం ఎంపీ రూ.3వేల కోట్ల నిధులు తెచ్చారని, వరికపూడిశెల ప్రాజెక్టు పూర్తి చేయాలని అడిగినందుకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును గుంటూరు వెళ్లమంటే ఒప్పుకోకపోతే తప్పనిపరిస్థితిలో టీడీపీలో చేరారన్నారు. ఇప్పటికైనా రైతు నరేంద్రను చెప్పుతో కొడతానని ఒప్పుకున్నందుకు ఈ సందర్భంగా ఆయన బొల్లాకు అభినందనలు తెలిపారు. 15 రోజులు జైల్లోపెట్టిన ఘనత మీకే దక్కిందని, వ్యక్తులను ఏకవచనంతో మాట్లాడరాదని ఆయన సూచించారు. త్వరలో ప్రజలే సరైన రీతిలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ నన్నేసా, సీనియర్ నాయకుడు వీరాంజనేయరెడ్డి, జరపాల గోవిందునాయక్, బీసీ నాయకులు గోవిందరాజులు, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సమావేశాన్ని జయప్రదం చేయాలి

నాగార్జున యూనివర్శిటీ సమీపంలో మంగళవారం జరిగే జయహో బీసీ సమావేశానికి నియోజకవర్గం నుంచి జనసేన, టీడీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌తో పాటు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, లోకేశ్, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొంటారన్నారు.

పల్స్‌పోలియోపై అధికారుల ఇంటింటి తనిఖీలు

శావల్యాపురం, మార్చి 4: పల్స్ పోలియోపై రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తనిఖీలలో భాగంగా మండలంలోని కనమర్లపూడి, శావల్యాపురం, కృష్ణాపురం గ్రామాలలో డబ్ల్యూహెచ్‌వో అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. డబ్ల్యూహెచ్‌వో పరిశీలకులు కె.నరసింహారావు పాల్గొని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పిల్లలకు పోలియో చుక్కలు వేశారా, లేదా అంటూ తల్లిదండ్రులను అడిగి తెలుసుకొన్నారు. పోలియో చుక్కలువేసిన పిల్లల చేతులకు వేసిన ఇంక్ గుర్తులను తనిఖీచేశారు. నరసింహారావు మాట్లాడుతూ శావల్యాపురం మండలంలో 0-5 ఏళ్ళలోపు పిల్లలు 3049 మంది ఉండగా వారిలో 2904 మందికి పోలియో చుక్కలు వేశారని, 95 శాతం పల్స్ పోలియో పూర్తయిందన్నారు. మిగిలిన పిల్లలకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయాలని సూచించామన్నారు. పోలియోబారిన పడకుండా పిల్లల్ని రక్షించుకోవాలంటే తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలన్నారు. వైద్యాధికారి మాన్యం రాధాకృష్ణన్, హెల్త్ సూపర్‌వైజర్ ఏడుకొండలు, ఏఎన్ఎంలు రాజ్యలక్ష్మీ, నాగలక్ష్మీ, విజయలక్ష్మీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆషా వర్కర్లు, సోమవారం ఇంటింట సర్వే నిర్వహించారు. పల్స్ పోలియో చుక్కలు వేయించుకున్న వేయించుకోని వారి గృహాలను గుర్తించారు. వైద్యాధికారులు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు. పల్స్‌పోలియో చుక్కలు వేయించుకోని వారికి చుక్కలను పంపిణీ చేశారు.



శావల్యాపురంలో తనిఖీచేస్తున్న డబ్ల్యూహెచ్‌వో పరిశీలకులు నరసింహారావు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వినుకొండటౌన్, మార్చి 4: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని చీకటీగలపాలెం సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే.. భారతాపురం గ్రామానికి చెందిన మారిశెట్టి రంగయ్య (53) పశువుల దాణా కొనుగోలుకు వినుకొండ వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో రంగయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య గంగమ్మ, ఇద్దరు సంతానం కలరు.

సాఫ్ట్‌బాల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ

వినుకొండ, మార్చి 4: వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ బీఏ చదువుతున్న విద్యార్థి ఎస్.రాము నాగార్జున యూనివర్శిటీ తరపున ఆల్ ఇండియా సాఫ్ట్ బాల్ టోర్నమెంట్‌కు ఎంపిక కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జున యూనివర్శిటీ తరపున గత మూడు సంవత్సరాలుగా పోటీల్లో పాల్గొనడం గర్వంగా ఉందని, బేస్‌బాల్ పోటీలకు సెలక్ట్ అయి అస్సాంలో జరిగే పోటీల్లో రాము పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థితో పాటు పీడీ జగదీష్‌ను కళాశాల అధ్యాపకులు అభినందించారు.



ఎస్.రాము

'అల్లర్లు సృష్టించేందుకు అధికారపార్టీ నేతల వ్యూహాలు'

మతుకుమల్లి (శావల్యాపురం) మార్చి 4: ఎన్నికలు సమీపిస్తున్నందున రాజకీయ లబ్ధికోసం ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టించేందుకు అధికారపార్టీ నాయకులు వ్యూహాలు రచిస్తున్నారని, వాటికి రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని మండలంలోని మతుకుమల్లి గ్రామానికి చెందిన పచ్చవ సూర్యనారాయణ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మతుకుమల్లి ఊరచెరువులో గతంలో అధికారపార్టీ నాయకులు అక్రమ మట్టి తవ్వకాలు చేస్తుంటే లోకాయుక్తకు ఫిర్యాదు చేశానన్నారు. మట్టి తవ్వకాలు చేసిన వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. అయితే చెరువు మొత్తాన్ని సర్వేచేసి ఆక్రమణలు తొలగించేందుకు సిద్ధమయ్యారని, ఆక్రమణల తొలగింపుపై తానే ఫిర్యాదు చేశానని తనపై తప్పుడు అభియోగాన్ని మోపి గ్రామంలో అల్లర్లు సృష్టించేందుకు అధికారపార్టీ నేతలు కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ అధికారులు చేస్తున్న ఆగడాలను అడ్డుకొని గ్రామంలో అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తెనాలి క్రైం, మార్చి 4: తెనాలి రైల్వే స్టేషన్ పరిధిలోని తెనాలి-నిడుబ్రోలు రైలు మార్గంలోచుండూరు స్టేషన్ సమీపంలోని నడిగడ్డపాలెం రైల్వే గేట వద్ద సోమవారం గుర్తు తెలియని30-35సంవత్సరాల యువకుడు ఎదురుగా వస్తున్న ట్రైన్‌ను గుర్తించకుండా పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత సమాచారం లభించకపోవడంతో మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

బైకును ఢీకొన్న టాటా మ్యాక్సీ: ఇద్దరు మృతి

వెల్దుర్తి, మార్చి 4: ద్విచక్ర వాహనాన్ని టాటా మ్యాక్సీ ఢీకొనగా ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలోని మండాదిలో జరిగింది. మండాదికి చెందిన శీలం కోటిరెడ్డి (36), శివారెడ్డి (50)లు ఆదివారం రాత్రి మిర్చి కల్లానికి కాపలా ఉండేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారి దాటుతుండగా మాచర్ల నుంచి శిరిగిరిపాడు వైపు వెళ్తున్న టాటా మ్యాక్సీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కోటిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో ఉన్న శివారెడ్డిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. కోటిరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలు న్నారు. శివారెడ్డికి కుమార్తె ఉంది. దీనిపై వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు గాయాలు

మాచర్ల రూరల్, మార్చి 4: రోడ్డు దాటుతున్న ఓ మహిళను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గాయపడిన ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. ఆదివారం రాత్రి పట్టణానికి చెందిన గుమ్మడి సత్యవతి మండాది రోడ్డులోని రైలు కట్టవద్ద రోడ్డు దాటుతుండగా, వెల్దుర్తి మండలం మండాదికి చెందిన వలంటీర్ నాగిరెడ్డి వెంకటరామిరెడ్డి ద్విచక్ర వాహనంపై మాచర్ల నుంచి స్వగ్రామం వెళ్తూ ఢీకొన్నాడు. ఈ సంఘటనలో సత్యవతి గాయాలపాలు కాగా మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేట తరలించారు. కాగా వెంకటరామిరెడ్డి కూడా స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

పోటీకి 175 మంది అభ్యర్థులు ఎక్కడ జగన్?

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 4: వైనాట్ 175 అంటున్న ముఖ్యమంత్రి జగన్ అసలు వైసీపీ నుంచి పోటీకి నిలబడే అభ్యర్థులు 175మంది ఎవరో చెప్పాలని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మూడు నెలల క్రితమే అభ్యర్థుల ఎంపిక చేపట్టి ఇప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యేల బదిలీలతో కుస్తీలు పడుతున్న జగన్ పరిస్థితి చూస్తే జాలేస్తుందన్నారు. గత ఎన్నికల్లో ఒక్కచాన్స్ అంటూ ప్రజలను నమ్మించి అడ్డదారుల్లో అధికారం దక్కించుకున్నంత ఈజీ కాదు రాజకీయాలంటే అన్నారు. సోమవారం చిలకలూరిపేటలో కుటుంబ సాధికార సారథులు, బూత్ నాయకులు, కార్యకర్తలతో ప్రత్తిపాటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు రాజకీయంగానే కాక రాష్ట్ర భవిష్యత్ రీత్యా చాలా కీలకంగా మారాయన్నారు. ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే తెలుగుదేశం, జనసేన చేతులు కలిపి ఈ పోరాటంలో ముందుకు వెళ్తున్నాయని స్పష్టం చేశారు. ఐదు సంవత్సరాలుగా రాష్ట్రాన్ని అన్ని విధాలా అధోగతి పాలు చేసిన వైసీపీ దొంగలకు వ్యతిరేకంగా టీడీపీ జనసేన ఉమ్మడి పోరాటం సాగిస్తుందన్నారు. రాష్ట్ర పునఃర్నిర్మాణం ప్రజల జీవితాల్లో వెలుగులే కూటమి లక్ష్యంగా ముందుకు వెళ్తుందన్నారు. వైసీపీ, జగన్ విముక్త ఆంధ్రప్రదేశ్‌ను సాధించి తీరుతామని ప్రత్తిపాటి విశ్వాసం వ్యక్తంచేశారు. రేపు జరగబోయే రాష్ట్రస్థాయి జయహో బీసీ బహిరంగ సభను పెద్దఎత్తున విజయ వంతం చేయాలని ప్రత్తిపాటి పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నియోజక వర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగ్గాపురం లైబ్రరీ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రత్తిపాటి శరత్ అరెస్టుకు నిరసన

యడ్లపాడు, మార్చి 4: మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ అరెస్టును నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని జగ్గాపురం, జాలాది గ్రామాలలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ ర్యాలీలో ఆయా గ్రామాలకు చెందిన పార్టీ అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కొవ్వొత్తులతోపాటు, ప్లకార్డులు చేతపట్టి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. జగ్గాపురం, జాలాది గ్రామాల టీడీపీ అధ్యక్షులు పోపూరి శ్రీనివాసరావు, పిన్నింటి శ్రీమన్నారాయణల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సర్కారు డొంకను పునరుద్ధరించాలి

యడ్లపాడు, మార్చి 4: మండలంలోని విశ్వనాధుని కండ్రిక అగ్రహార పరిధిలోని సర్కారు డొంకను పునరుద్ధరించాలని స్థానిక రైతులు సోమవారం ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. యడ్లపాడు-కారుచోల ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఓటికుంట చెరువు మీదుగా విశ్వేశ్వరస్వామి మాన్యం వరకు సర్కారు డొంక ఉందన్నారు. గతంలో ఈ మార్గం గుండా రైతులు అరకలు, ఎడ్లబండ్లతో తమ పొలాలకు రాకపోకలు సాగించేవారన్నారు. కాలక్రమంలో ఆక్రమణకు గురికావడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో అధికారులు డొంక హద్దులు గుర్తించడం జరిగిందన్నారు. గుర్తించిన హద్దుల మధ్య డొంకను పునరుద్ధరించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యను తొలగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పి.కృష్ణ, సుబ్బారావు, మోహన్, పోపూరి వెంకటరత్తయ్య, నాగచౌదరి, సోమయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ హామీలను అమలుచేయాలి

● మునిసిపల్ కార్మిక సంఘాల నాయకులు

చిలకలూరిపేట, మార్చి 4: రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ కార్మికుల జీతాలను రూ.21వేలకు పెంచుతూ ఇచ్చిన జీవోను తక్షణం అమలుచేయాలని మునిసిపల్ కార్మిక సంఘాల నాయకులు సోమవారం కోరారు. ఈ మేరకు వారు మునిసిపల్ కమిషనర్ గోవిందరావును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు జనవరి, ఫిబ్రవరి నెలల జీతాలను తక్షణం చెల్లించాలని కోరారు. ఇటీవల జరిగిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన నూరుశాతం పండుగ అడ్వాన్స్ జీవోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు యూనిఫాం, చెప్పులు, కొబ్బరి నూనె, సబ్బులు వెంటనే అందజేయాలని కోరారు. ట్రాక్టర్లు, పెద్ద వాహనాల డ్రైవర్లకు కూడా రూ.24,500 మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగభైరు రామ సుబ్బాయమ్మ, పేలూరి రామారావు, బొంతా భగత్‌సింగ్, చెంచయ్య, వేల్పుల రామాంజనేయులు, వై నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మునిసిపల్ కార్మికులు, నాయకులు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి యత్నం

యడ్లపాడు, మార్చి 4: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి చోరీ యత్నం చేసిన సంఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్తవరపు సామ్రాజ్యం ఎన్టీఆర్ సెంటర్‌కు సమీపంలోని ఇంటిలో ఒంటరిగా నివాసం ఉంటోంది. ఆమెకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆదివారం గుంటూరులో నివాసం ఉంటున్న తన కుమారుడు నాగచౌదరి వద్దకు వెళ్ళింది. సోమవారం ఉదయం పక్కింటి వాళ్ళు సామ్రాజ్యం ఇంటి వద్దకు వెళ్ళగా తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించి గుంటూరులో ఉన్న సామ్రాజ్యంకు సమాచారం అందించారు. కుమారుడు నాగచౌదరి గ్రామానికి వచ్చి పరిశీలించగా ప్రధాన ద్వారానికి వేసిఉన్న తాళం పగులగొట్టి ఉంది. లోపలకి వెళ్ళి చూడగా అల్మారాలోని దుస్తులు, సామాన్లు చిందరవందరగా కింద పడవేసి ఉన్నాయి. ఇంట్లో ఎలాంటి విలువైన వస్తువులు లేవని, అల్మారాలో ఉంచిన రూ.450లు మాత్రం దొంగలు తీసుకెళ్ళారన్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆసరా డబ్బులివ్వకుండానే లబ్ధిదారులతో వేలిముద్రలు

శావల్యాపురం, మార్చి 4: వైఎస్సార్ ఆసరా 4వ విడత రుణమాఫీలో భాగంగా ప్రభుత్వం ఇటీవల డ్వాక్రా మహిళల ఖాతాలో జమచేసిన నగదు వారికి ఇవ్వకుండానే నగదు తీసుకొన్నట్లుగా వెలుగు సిబ్బంది బయోమెట్రిక్ వేయించుకొంటున్నారని కొందరు మహిళలు సోమవారం ఆరోపించారు. మండలంలోని 706డ్వాక్రా సంఘాలలోని 6892మంది మహిళలకు రూ.5.51కోట్ల రుణమాఫీ చెక్కును ఫిబ్రవరి 23న వేల్పూరులో ఎమ్మెల్యే అందజేశారు. ఖాతాల్లో నగదు జమైనట్లుగా బ్యాంక్ నుంచి కొందరు మహిళలకు మెస్సేజ్‌లు రావడంతో వారు నగదు తీసుకొనేందుకు బ్యాంక్‌లకు వెళితే ఇంకా నగదు జమకాలేదని బ్యాంకు అధికారులు చెప్పడంతో వారు వెలుగు సిబ్బందిని ప్రశ్నించారు. వారు కూడా నగదు జమకాలేదని చెప్పడంతో నగదు ఇవ్వకుండా బయోమెట్రిక్ ఎలా వేయించుకొంటారని మహిళలు ప్రశ్నించారు. నగదు జమకాకుండా మెసేజ్‌లు రావడం, నగదు ఇవ్వకుండా బయోమెట్రిక్ వేయించుకోవడంపై మహిళల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. దీనిపై ఏపీఎం వాసుబాబును వివరణ అడగ్గా నగదు ఇవ్వకుండా బయోమెట్రిక్ వేయించకూడదని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నగదు జమయ్యేలా చూడాలని మహిళలు కోరారు.